సాక్షి కర్నూలు

బుధవారం, 7, జూన్, 2023



పరివార దేవుళ్లకు పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేష పూజలు నిర్వహించారు



కేసీకి 104 క్యూసెక్కుల నీరు

గూడూరు: తాగునీటి అవసరాలకు సుంకేసుల రిజర్వాయర్ నుంచి కేసీ కాల్వకు మంగళవారం 104 క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. డ్యాంలో 1.110 టీఎంసీల నీరు నిల్వ ఉంది.



వర్ష సూచన

ఎమ్మిగనూరు రూరల్: జిల్లాలో నేటి నుంచి ఈనెల 11 వరకు చిరు జల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉందని బనవాసి కేవీకే వాతావరణ విభాగం శాస్త్రవేత్త మహాదేవయ్య తెలిపారు.

న్యూస్‌రీల్

విద్యుత్ సమస్యలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు



ఫోన్‌లో ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్ఈ ఎం.ఉమాపతి

కర్నూలు (రాజ్‌విహార్): విద్యుత్ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి అన్నారు. మంగళవారం ఆయన స్థానిక విద్యుత్ భవన్‌లో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి వినియోగదారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొత్త కనెక్షన్లు, అధిక బిల్లులు, స్తంభాల కొరత, అంతరాయం వంటి సమస్యలను విన్న ఆయన.. వాటిని నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని కింది స్థాయి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నెలనెలా డబ్బులు చెల్లించే వినియోగదారులకు మెరుగైన సేలందించాల్సిన బాధ్యత విద్యుత్‌శాఖపై ఉందన్నారు. ఈ విషయంలో అలసత్వం తగదన్నారు. జూనియర్ లైన్‌మెన్ మొదలుకొని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల వరకు ప్రతి ఉద్యోగి పనిచేసే ప్రాంతంలో నివాసం ఉండాలని చెప్పారు.

12న అప్రెంటీస్ మేళా

కర్నూలు సిటీ: ఈ నెల 12న ప్రధాన మంత్రి అప్రెంటీస్ మేళా నిర్వహించనున్నట్లు ఐటీఐ కాలేజీల కన్వీనర్ పీవీ ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఉత్తీర్ణులైన నిరుద్యోగ యువతీ, యువకుల కోసం నిర్వహిస్తున్న ఈ మేళాకు జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వేత్తలు హాజరై, వారికి అవసరం ఉన్న అభ్యర్థులను ఎంపిక చేసుకుంటారన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు https://apprenticeshipindia.org నందు రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు తమ ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు(ఎస్ఎస్‌సీ, ఐటీఐ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, పాన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్, ఫొటోలు, అప్రెంటీస్ రిజిస్ట్రేషన్ నెంబరు)తీసుకుని బి.తాండ్రపాడు ప్రభుత్వ బాలికల ఐటీఐ కాలేజీలో నిర్వహించే మేళాకు హాజరుకావాలన్నారు.

43 డిగ్రీలకు పైనే ఉష్ణోగ్రతలు

కర్నూలు(అగ్రికల్చర్): నైరుతి రుతుపవనాలు రాయలసీమ జిల్లాల్లో విస్తరించడంలో జాప్యం జరుగుతుండటంతో ఎండాకాలం కొనసాగుతోంది. గత ఏడాది మే నెల చివరి నుంచే వర్షాలు మొదలయ్యాయి. జూన్ మొదటి వారంలోనే విస్తారంగా వర్షాలు కురిశాయి. మామూలుగా అయితే మే నెల చివరికే ఎండలు, వడగాలుల తీవ్రత తగ్గుతుంది. ఈ సారి జూన్ మొదటి వారం పూర్తి అవుతున్నప్పటికీ వేసవి, వడగాలుల తీవ్రత కొనసాగుతుండటం ఆందోళన కలిగిస్తోంది. సాయంత్రానికి కూడా ఎండల తీవ్రత తగ్గని పరిస్థితి. జూన్ నెల మొదటి వారంలో 38 నుంచి 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కానీ ఉమ్మడి కర్నూలు జిల్లాలో 43 డిగ్రీలకు పైనే నమోదు అవుతోంది. సాయంత్రం 4 గంటల సమయానికి బండి ఆత్మకూరులో 41.84, పాణ్యం మండలం గోనవరంలో 41.66, గోస్పాడులో 41.64, మంత్రాలయంలో 41.64, సంజామల మండలం పేరుసోములలో 41.61 డిగ్రీల ప్రకారం ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయి. రానున్న ఐదు రోజుల్లో పగటి ఉష్ణోగ్రతలు 36.1 నుంచి 41 డిగ్రీల వరకు, రాత్రి ఉష్ణోగ్రతలు 22.4 డిగ్రీల నుంచి 28.6 డిగ్రీల వరకు నమోదయ్యే అవకాశం ఉంది.

సూక్ష్మ సేద్యం.. సిరుల భాగ్యం

అరటి తోటకు డ్రిప్ సౌకర్యం కల్పించిన దృశ్యం



- గతేడాది 4,509 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం
- ఈ ఏడాది 5 వేల హెక్టార్లకు కల్పించే విధంగా లక్ష్యం
- బోరున్న ప్రతి రైతూ అర్హుడే
- ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు
- 90 శాతం సబ్సిడీతో బిందు సేద్యం
- 55 శాతం సబ్సిడీతో స్ప్రింక్లర్లు



డ్రిప్ పరికరం



కర్నూలు(అగ్రికల్చర్): సూక్ష్మ సేద్యంతో రైతులు అధిక దిగుబడులు సాధిస్తూ లాభాలను ఆర్జిస్తున్నారు. గతేడాది సూక్ష్మ సేద్యం కోసం రాష్ట్ర ప్రభుత్వం కర్నూలు జిల్లాలోని రైతులకు 36.15 కోట్ల సబ్సిడీలు ఇచ్చింది. ఈ ఏడాది మరింత పెద్ద ఎత్తున సబ్సిడీలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వం ఇచ్చిన లక్ష్యాల మేరకు రైతులు.. డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతుభరోసా కేంద్రాల్లో ముమ్మరంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు. అన్ని రకాల పండ్లు, పూల తోటలకు, మల్బరీ, వేరుశనగ, మొక్కజొన్న, పత్తి, కూరగాయల పంటలకు బిందు సేద్యం కల్పించుకోవచ్చు. ఆకు కూరలు, వేరుశనగ, శనగ పంటలకు స్ప్రింక్లర్లు చాలా ఉపయోగపడతాయి. బోరు, విద్యుత్ కనెక్షన్ ఉన్న ప్రతి రైతూ సూక్ష్మ సేద్యానికి అర్హులే.

గత ఏడాది 4,509 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం

గతేడాది 3700 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం కల్పించాలనేది లక్ష్యం కాగా.. 4509.04 హెక్టార్లకు కల్పించారు. లక్ష్యానికి మించి 809 హెక్టార్లకు అదనంగా కల్పించడం విశేషం. డ్రిప్, స్ప్రింక్లర్ల సేద్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.36.15 కోట్లు సబ్సిడీ భరించింది. జిల్లాలో 3507 మంది రైతులకు 3,332.57 హెక్టార్లకు డ్రిప్ సదుపాయం కల్పించారు. మొత్తం విలువ రూ.41.35 కోట్లు ఉండగా.. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.34.48 కోట్లు భరించింది. అలాగే 1,077 మంది రైతులకు సంబంధించి 1,176.47 హెక్టార్లకు స్ప్రింక్లర్లు(తుంపర్లు) సదుపాయం కల్పించగా రూ.3.16 కోట్లు ఖర్చు వచ్చింది. ప్రభుత్వం సబ్సిడీ కింద రూ.1.66 కోట్లు భరించింది.

ఈ ఏడాది లక్ష్యాలు ఇలా...

2023-24 సంవత్సరంలో ప్రభుత్వం సూక్ష్మ సేద్యానికి పెద్దపీట వేస్తోంది. ఈ ఏడాది 5,000 హెక్టార్లకు సూక్ష్మ సేద్యం సదుపాయం కల్పించాలని లక్ష్యంగా ఇచ్చింది. గత ఏడాది సూక్ష్మ సేద్యం కోసం రిజిస్ట్రేషన్ చేసుకొని మంజూరు కాని రైతుల వివరాలను 2023-24 సంవత్సరంలో బదలాయించారు. తాజాగా కూడా రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయి. ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం, 5 ఎకరాల నుంచి 10 ఎకరాల్లోపు రైతులకు 70 శాతం సబ్సిడీతో బిందు సేద్య సదుపాయం కల్పిస్తారు. స్ప్రింక్లర్లు తీసుకుని సన్న, చిన్న కారులకు 55 శాతం, 5 ఎకరాలు పైబడిన రైతులకు 45 శాతం సబ్సిడీ లభిస్తుంది. గత ఏడాది రైతులతో సహా 8138 మంది సూక్ష్మసేద్యం సదుపాయం కోసం ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

డ్రిప్ ఉపయోగాలు ఇలా...

బిందు సేద్యం ద్వారా పంటలను బట్టి 30-70 శాతం వరకు నీటిని ఆదా చేయవచ్చు. ఎక్కువ విస్తీర్ణంలో పంటలు సాగు చేయవచ్చు. అన్ని మొక్కలకు సమానంగా నీరు సరఫరా అవుతుంది. అధిక మొలక శాతం, సమానమైన పంట పెరుగుదల ఉంటుంది. కలుపు సమస్యలు బాగా తగ్గుతాయి. నీటి ద్వారానే ఎరువుల సరఫరా చేస్తుండటం వల్ల పంట పెరుగుదలకు అనుగుణంగా పోషకాల సరఫరా అవుతాయి. ఏక కాలంలో పంట కోతకు వస్తుంది. సూక్ష్మ సేద్యం ద్వారా కరెంటు 40 శాతం ఆదా అవుతుంది. కూలీల ఖర్చు 40 శాతం వరకు తగ్గుతుంది. పంటలకు పురుగులు, చీడ పీడల సమస్య తక్కువగా ఉంటుంది. ఎత్తుపల్లాలు గల నేలలో కూడా సులభంగా నీరు పారించవచ్చు. నాణ్యమైన ఉత్పత్తి రావడంతోపాటు ఎకరాకు 20-30 శాతం వరకు దిగుబడి పెరుగుతుంది.



తోటలో బొప్పాయి కాయలను చూపిస్తున్న ఈ రైతు పేరు వై.సతీష్. పెద్దకడుబూరు మండలం బసలదొడ్డి గ్రామ వాసి. గతేడాది 3.5 ఎకరాల్లో బొప్పాయి మొక్కలు నాటుకున్నారు. డ్రిప్ సదుపాయం కల్పించుకున్నారు. దీంతో దిగుబడి 20 టన్నులు అదనంగా వచ్చింది. కాయ నాణ్యత బాగా ఉండటంతో టన్నుకు రూ.14,000 ధర లభించింది. మొత్తం రూ.14.70 లక్షల ఆదాయం వచ్చింది. పెట్టుబడి వ్యయం రూ.4,02,500 మినహాయిస్తే నికరంగా రూ.10,67,500 లాభం చేకూరింది.

ఈ రైతుపేరు మధుశేఖర్. వెల్దుర్తి మండలం రామళ్లకోట గ్రామానికి చెందిన ఈయన గతేడాది స్ప్రింక్లర్ల సదుపాయం పొంది మూడు ఎకరాల్లో వేరుశనగ సాగు చేశారు. పెట్టుబడి వ్యయం బాగా తగ్గి ఎకరాకు ఐదు టన్నుల దిగుబడి వచ్చింది. స్ప్రింక్లర్ల కింద సాగు చేయడం వల్ల ఖర్చులు పోను రూ.2,04,950 లభించింది. కాల్వల కింద సాగుతో పోలిస్తే.. స్ప్రింక్లర్ల కింద వేరుశనగ సాగు చేయడం వల్ల అదనంగా రూ.1,17,450 ఆదాయం వచ్చింది.



దిగుబడులు పెరిగాయి



గతేడాది సూక్ష్మ సేద్యం సాగులో మంచి ఫలితాలు వచ్చాయి. డ్రిప్ కింద టమాట, మిర్చి, పత్తితో పాటు వివిధ ఉద్యాన పంటలు సాగు చేశారు. దిగుబడులు గణనీయంగా పెరిగాయి. రైతులకు నికరాదాయం లభించింది. సూక్ష్మ సేద్యం కింద ప్రభుత్వం రూ.36.50 కోట్ల సబ్సిడీలు ఇచ్చింది. ఈ ఏడాది 5000 హెక్టార్లలో సూక్ష్మ సేద్యం కల్పించాలనేది లక్ష్యం. రైతులు ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

–ఉమాదేవి, ప్రాజెక్టు డైరెక్టర్, ఏపీఎంఐపీ, కర్నూలు

ముగిసిన పింఛన్ల పంపిణీ

- నంద్యాలకు 5వ స్థానం.. కర్నూలు జిల్లాకు 6వ స్థానం

కర్నూలు(అగ్రికల్చర్): జూన్ నెలకు సంబంధించి వైఎస్ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం ముగిసింది. పంపిణీలో నంద్యాల జిల్లాకు 5వ స్థానం, కర్నూలు జిల్లాకు 6వ స్థానం లభించింది. గ్రామ, వార్డు వలంటీర్లు వ్యయ ప్రయాసలకోర్చి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న లబ్ధిదారుల వద్దకే వెళ్లి పింఛన్లు అందజేయడం విశేషం. కర్నూలు జిల్లాలో 2,37,462 పింఛన్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఇందులో 2,35,461 పింఛన్లు పంపిణీ చేశారు. మొత్తం రూ.66.02 కోట్లు విడుదల కాగా.. రూ.65.45 కోట్లు పంపిణీ జరిగింది. కర్నూలు జిల్లాలో సి.బెళగల్ మండలం మొదటి స్థానంలో నిలిచింది. అర్బన్ ప్రాంతాల్లో గూడూరు మున్సిపాలిటీ మొదటి స్థానం దక్కించుకున్నట్లు డీఆర్‌డీఏ-వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య తెలిపారు.

నంద్యాల జిల్లాలో...

మొత్తం 2,14,939 పింఛన్లు ఉండగా 2,13,275 పంపిణీ అయ్యాయి. రూ.59.32 కోట్లు విడుదల చేయగా.. రూ.58.86 కోట్లు పంపిణీ చేయడం విశేషం. ఈ జిల్లాలో జూపాడుబంగ్లా మండలం మొదటి స్థానం దక్కించుకుంది. అర్బన్ ప్రాంతాలకు సంబంధించి నందికొట్కూరు మున్సిపాలిటీ మొదటి స్థానంలో నిలిచింది.

13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి ఉత్తర్వుల మేరకు ఈ నెల 13న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలను నిర్వహిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ జి.నాసరరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జెడ్పీలోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10 గంటలకు గ్రామీణాభివృద్ధి, 11 గంటలకు వ్యవసాయం, 12 గంటలకు సాంఘిక సంక్షేమం, 1 గంటకు విద్య, వైద్యం, 2.30 గంటలకు మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, 3.30 గంటలకు ఆర్థిక, ప్రణాళిక, పనులకు సంబంధించి ఆయా శాఖలకు చెందిన అధికారులతో సమీక్ష నిర్వహిస్తామన్నారు. సమావేశాలకు ఉమ్మడి జిల్లాలకు చెందిన వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు, జెడ్పీటీసీలు నిర్ణీత సమయంలోగా హాజరు కావాలని కోరారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు 10వ తేదీ ఆఖరు

కర్నూలు(అర్బన్): 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకానికి ఈ నెల 10వ తేదిలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారిణి ఎస్.సబీహా పర్వీన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ దేశాల్లో అత్యధిక ప్రాధాన్యత కలిగిన 200 విశ్వ విద్యాలయాల్లో విద్యను అభ్యసించేందుకు మైనారిటీ కులాలకు(ముస్లిం/దూదేకుల/క్రిష్టియన్(బీసీ-సీ)/సిక్కులు/జైనులు) బౌద్ధులు/జోరాష్ట్రియన్లు(పార్శీకులు) చెందిన అర్హులైన విద్యార్థినీ, విద్యార్థులు hhps://jnanabhumi.apcfss.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9160903300 నెంబర్‌ను సంప్రదించాలని పేర్కొన్నారు.

పునఃప్రారంభమైన లోకాయుక్త

కర్నూలు(సెంట్రల్): లోకాయుక్తకు వెకేషన్ సెలవులు పూర్తయ్యాయి. మంగళవారం నుంచి లోకాయుక్త బెంచ్ పునః ప్రారంభమైంది. చైర్మన్ జస్టిస్ పి.లక్ష్మణ్‌రెడ్డి హాజరై పలు కేసుల విచారణ చేపట్టారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించి లోకాయుక్త సేవలను పొందేందుకు ముందుకు రావాలని ఆ సంస్థ కార్యదర్శి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

గురుకులాల్లో సీట్ల భర్తీకి చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసకుమార్

కర్నూలు(అర్బన్): జిల్లాలోని గిరిజన ఆశ్రమ పాఠశాలలు, గురుకులాలు, వసతి గృహాల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీట్ల భర్తీకి చర్యలు చేపట్టాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఎస్.శ్రీనివాసకుమార్ ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ఆయా విద్యా సంస్థలకు చెందిన ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, వసతి గృహ సంక్షేమాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆయా విద్యా సంస్థల్లో మొత్తం మంజూరైన విద్యార్థుల సంఖ్య 1940 కాగా, ప్రస్తుతం 1283 మంది మాత్రమే ఉన్నారన్నారు. 10వ తరగతి విద్యార్థులు వెళ్లిపోయిన నేపథ్యంలో రెన్యూవల్ విద్యార్థులు మినహా, మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు అవసరమైతే గిరిజన తండాలు, ఎస్టీ కాలనీలకు వెళ్లి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ నెల 12 నుంచి అన్ని విద్యా సంస్థలు పునః ప్రారంభమవుతున్న దృష్ట్యా పెరిగిన ధరలకు అనుగుణంగా కొత్త మెనూను పాటించాలన్నారు. వసతి గృహాలు, గురుకులాల్లో విద్యార్థులకు అత్యావసరమైన మౌలిక వసతులను కల్పించేందుకు నివేదికలను రూపొందించాలన్నారు. సమావేశంలో ఆయా విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, వార్డెన్లు పాల్గొన్నారు.

క్రిటికల్ కేర్ యూనిట్ మంజూరు

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రాష్ట్ర ప్రభుత్వం క్రిటికల్ కేర్ యూనిట్‌ను మంజూరు చేసింది. జి+2 ప్రణాళికతో 30 సెంట్ల స్థలంలో ఈ భవనాన్ని నిర్మించేందుకు రూ.23 కోట్లను ఇవ్వనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ఉన్నతాధికారుల నుంచి ఆసుపత్రి అధికారులకు సమాచారం అందింది. దీంతో క్రిటికల్ కేర్ యూనిట్ భవన నిర్మాణానికి అవసరమైన ప్రదేశాన్ని ఆసుపత్రి అధికారులు మంగళవారం అన్వేషించారు. 50 పడకలతో నిర్మించనున్న ఈ భవన నిర్మాణం వచ్చే ఏడాది ప్రారంభమయ్యే అవకాశమున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి.

కాటేసిన చీకటి

రెప్పపాటులో ఘోరం

- కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో రోడ్డు ప్రమాదం
- నిలిచిన లారీని ఢీకొన్న తుఫాన్ వాహనం
- ఐదుగురు దుర్మరణం.. 13 మందికి గాయాలు
- మృతులు వెలుగోడు, బండిఆత్మకూరు వాసులు
- బంధువులంతా కలబుర్గి ఉరుసుకు వెళ్తుండగా ఘటన

వారంతా దగ్గరి బంధువులు.. ఏడాదికోసారి జరిగే కలబుర్గి ఉరుసుకు ప్రయాణమయ్యారు. పిల్లలు, పెద్దలు సంతోషంగా వాహనంలో బయలుదేరారు. మరికొద్ది గంటల్లో దర్గాను దర్శించుకుని మొక్కులు చెల్లించాల్సిన వారిని మృత్యువు కాటేసింది. నిద్రలో ఉన్న కొందరిలో ఐదుగురు శాశ్వతనిద్రలోకి వెళ్లారు. మరి కొందరు రక్తమోడుతూ విలవిలలాడారు. వారి ఆర్తనాదాలు చీకటిలో కలిసిపోయాయి. కదలలేని స్థితిలో ఉన్న చిన్న పిల్లలను చూసి తట్టుకోలేక పోయారు. మంగళవారం తెల్లవారుజామున కర్ణాటక రాష్ట్రం యాదగిరి జిల్లా సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురు దుర్మరణం చెందారు. బాధితులది వెలుగోడు, బండి ఆత్మకూరు కావడంతో ఆ ప్రాంతాల్లో విషాదం నెలకొంది.

వెలుగోడు/నంద్యాల: దైవ దర్శనానికి వెళ్తున్న ఓ బృందాన్ని లారీ రూపంలో మృత్యువు కబళించింది. నిరుపేద కుటుంబాల్లో ప్రమాదం విషాదాన్ని నింపింది. మృతుల్లో తండ్రి కుమారుడు, అత్తాఅల్లుళ్లు ఉన్నారు. మృతులంతా దగ్గరి రక్తసంబంధీకులు కావడంతో ప్రమాద సమాచారం తెలుసుకున్న బంధువులు ఉలిక్కిపడ్డారు. తమవారికి ఎలా ఉందో తెలియక ఆందోళన పడ్డారు. కర్ణాటక రాష్ట్రం కలబుర్గిలో జరుగుతున్న ప్రసిద్ధ ఖాజా బందెనవాజ్ ఉరుసులో మొక్కు తీర్చుకోవాలని వెలుగోడు, బండిఆత్మకూరుకు చెందిన బంధువుల కుటుంబాలకు చెందిన 18 మంది సోమవారం రాత్రి తుఫాన్ వాహనంలో బయల్దేరారు. కర్ణాటక రాష్ట్రం రాయచూరు దాటి నలభై కిలోమీటర్లు దూరం వెళ్లిన తర్వాత యాదగిరి జిల్లా సైదాపుర సమీపంలోని బళిచక్కర్ వద్ద రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని తుఫాన్ వేగంగా ఢీకొట్టింది. వాహనం నుజ్జునుజ్జు అయి అందులో ఉన్న ఐదుగురు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మరో 13 మందికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో బండిఆత్మకూరు కు చెందిన తండ్రి, కొడుకు చనిపోయారు. మృతి చెందిన వారిలో వెలుగోడుకు చెందిన షేక్ రమిజాబీ(48), న్యామతుల్లా (40), సుమయా(12), బండి ఆత్మకూరుకు చెందిన గడ్డమీది మునీర్ బాషా(37), ముదషీర్ (12) ఉన్నారు. క్షతగాత్రుల్లో సోహేల్(15) కు వెన్నెముక విరిగింది. మెదడులో రక్తం గడ్డ కట్టింది. రెండేళ్ల అనస్ అనే బాలుడి తలకు తీవ్రగాయమైంది. ఈ ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పారు. హనీఫ్(32) అనే వ్యక్తి ఊపిరి పీల్చుకునేందు కు ఇబ్బంది పడుతున్నాడని, కాళ్లు విరిగినట్లు బంధువులు తెలిపారు. క్షతగాత్రులను చికిత్స అనంతరం కర్నూలు వైద్యశాలకు తరలించారు. ప్రమాద విషయం తెలియడంతో బండిఆత్మకూరు, వెలుగోడు మండలాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.





మృతి చెందిన న్యామతుల్లా, సుమయా (ఫైల్)

మృతులందరూ రమిజాబీ రక్త సంబంధీకులే..

కర్ణాటక రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఐదుగురు రక్త సంబంధీకులు. వీరంతా వెలుగోడు పట్టణంలోని మంచినీళ్ల బావి ప్రాంతానికి చెందిన మృతురాలు రమిజాబీ కుటుంబ సభ్యులే. ఈమె భర్త ఖాసీం సాహెబ్ గౌండ పని చేస్తున్నారు. ఆమె పెద్దకుమార్తె షేక్ నసీమాను అదే ఊరిలోని న్యామతుల్లాతో వివాహమైంది. రెండో కుమార్తె షేక్ నాజియా బండిఆత్మకూరుకు చెందిన గడ్డమీది మునీర్ బాషాతో వివాహమైంది. ఈ ప్రమాదంలో రమిజాబీతో పాటు ఇద్దరు అల్లుళ్లు న్యామతుల్లా, గడ్డమీది మునీర్ బాషా దుర్మరణం చెందారు. మునీర్ బాషా కుమారుడు ముదసీర్ కూడా మృత్యుఒడి చేరాడు. అలాగే రమిజాబీ పెద్ద కుమారుడు మాసూం బాషా కుమార్తె షేక్ సుమయా కూడా మృత్యువాత పడింది. సుమయా వెలుగోడు జీబీఎం స్కూల్‌లో 5వ తరగతి చదువుతోంది.



రమిజాబీ (ఫైల్)



ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన తుఫాన్ వాహనం

తండ్రి, కుమారుడు..





మృతి చెందిన మునీర్‌బాషా, ముదషీర్

బండిఆత్మకూరు మండల కేంద్రానికి చెందిన మృతుడు మునీర్‌బాషా (37) గౌండ పని చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి పొలం, ఆస్తులు లేవు. గౌండా పనితో పాటు గ్రామంలో పొలాన్ని కౌలుకు తీసుకొని కుటుంబాన్ని నెట్టుకొని వచ్చేవాడు. అయితే వెలుగోడుకు చెందిన అత్తామామలు కలబుర్గి ఉరుసుకు వెళ్దామని చెప్పడంతో భార్య, పిల్లలతో అతను బయలుదేరాడు. ఈ ప్రమాదంలో మునీర్‌బాషాతో పాటు అతని కుమారుడు ముదషీర్(12) మృతి చెందాడు. నజియా, మరో కుమారుడు ముల్లామీల్‌లు గాయాలతో బయటపడ్డారు. కుటుంబాన్ని పోషించే భర్త మునీర్‌బాషా చనిపోవడంతో నజియా రోదనలు మిన్నంటాయి. భర్త, కుమారుడిని కోల్పోయానని, మిగిలిన ఒక్క కుమారుడిని ఎలా పోషించుకోవాలి.. దేవుడా అంటూ ఆమె రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది.

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎస్ఐ జగన్ మోహన్ మృతురాలు రమిజాబీ ఇంటి వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. రోడ్డు ప్రమాద బాధితులంతా గౌండ, వ్యవసాయ పనులు చేసుకునే వారు. ఈ ప్రమాదం వారి కుటుంబాల్లో చీకట్లు నింపింది.

తీర్థయాత్రలు విషాదాంతం

మూడు రోజుల క్రితం శనివారం నంద్యాల నుంచి అరుణాచలం దైవదర్శనానికి తుఫాన్ వాహనంలో వెళుతూ లారీని ఓవర్ టేక్ చేయబోయి నంద్యాలకు చెందిన నలుగురు మృతి చెందగా 9 మందికి గాయాలయ్యాయి. ఇదే తరహాలో మంగళవారం తుఫాన్ వాహనంలో బండిత్మకూరు, వెలుగోడుకు చెందిన 18 మంది కలబుర్గి దర్గా దర్శనానికి వెళుతూ ఆగిఉన్న లారీని ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందగా 13 మందికి గాయాలయ్యాయి. మూడు రోజుల వ్యవధిలోనే దైవదర్శనానికి వెళుతూ నంద్యాల జిల్లాకు చెందిన 9 మంది మృతి చెందగా, 22 మందికి గాయాలు కావడంతో జిల్లాలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఈ రెండు ప్రమాదాలు ఒకే విధంగా చోటు చేసుకున్నాయి.

ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దిగ్భ్రాంతి..

కర్ణాటకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీశైలం నియోజకవర్గానికి చెందిన ఐదుగురు మృత్యువాత పడటం పట్ల ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి దిగ్భ్రాంతికి గురయ్యారు. రోడ్డు ప్రమాదం గురించి వెలుగోడు పట్టణ వైఎస్ఆర్‌సీపీ నాయకుల ద్వారా ఎమ్మెల్యే శిల్పా తెలుసుకొని మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఘటన స్థలానికి వెలుగోడుకు చెందిన వైఎస్ఆర్‌సీపీ నాయకులు, అడ్వకేట్‌ను పంపారు. బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. సొంత ఖర్చులతో మృతదేహాలను సొంతూళ్లకు తరలిస్తామన్నారు. క్షతగాత్రులను మెరుగైన వైద్యం కోసం తరలించాలని, హాస్పిటల్ యాజమాన్యంతో తానే చర్చిస్తానని హామీ ఇచ్చారు.

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో యువకుడి మృతి


మృతి చెందిన ప్రతాప్ (ఫైల్)

కొలిమిగుండ్ల: జీవనోపాధి కోసం నాపరాతి గనిలో పని చేస్తున్న యువకుడిని కరెంట్ కాటేసింది. ఈ విషాదకర సంఘటన మంగళవారం బెలుంలో చోటు చేసుకుంది. అవుకు మండలం చెన్నంపల్లెకు చెందిన చీకిరి హుసేని, మరియమ్మ దంపతులు కొన్నేళ్ల క్రితం బెలుం ఎస్సీ కాలనీలో స్థిరపడ్డారు. వీరికి బెలుం–మీర్జాపురం సమీపంలో గని ఉంది. వారి పెద్ద కుమారుడు ప్రతాప్(23) రోజు మాదిరిగానే గనిలో పనికి వెళ్లాడు. విద్యుత్ కోత మిషన్‌తో నాపరాళ్లను కోత కోస్తుండగా మిషన్‌కు చెందిన తీగ కింద ఉన్న నీళ్లలో పడటంతో విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. గనికి వెళ్లిన కుమారుడు విగతజీవిగా ఇంటికి చేరడంతో తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద వివరాలు సేకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ శ్రామ్‌కు దరఖాస్తు చేసుకోండి

కర్నూలు(రాజ్‌విహార్): అసంఘటిత కార్మికులు ఈ శ్రామ్ కార్డుకు దరఖాస్తు చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుడి భవిష్యత్తుకు ఈ కార్డు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ తమ సమీపంలోని సచివాలయాలు, మీ సేవ కేంద్రాలకు వెళ్లి తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

వృద్ధాశ్రమాల ఏర్పాటుకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

కర్నూలు(అర్బన్): జిల్లాలో వృద్ధాశ్రమాల ఏర్పాటు, నిర్వహణకు ఏపీ సొసైటీల రిజిస్ట్రేషన్ల చట్టం, కంపెనీల చట్టం, భారతీయ ధర్మ సంస్థల చట్టం లేదా రిజిస్ట్రేషన్‌కు వీలు కల్పించే ప్రస్తుతం అమలులో ఉన్న ఏదైనా చట్టం కింద రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి. వెంకటరమణ కోరారు. రిజిస్ట్రేషన్ ధ్రువపత్రం కోసం రూ.100 డీడీ లేదా క్రాస్ చేసిన చెక్కును తమ శాఖ విజయవాడ పేర తీసి ఫారం ఎంలో వివరాలను పొందుపరిచి కలెక్టరేట్‌లోని తమ కార్యాలయానికి పంపాలని ఆయన మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇప్పటికే ఆశ్రమాలు నిర్వహిస్తున్న వారు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ కోసం వెంటనే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ ఆదేశాలు ఉల్లంఘిస్తే సెక్షన్ 19 (14) నియమం కింద రూ.25 వేల వరకు జరిమానాతో పాటు శిక్షకు గురి కావాల్సి వస్తుందన్నారు.

ఆహారశుద్ధి పరిశ్రమల హబ్‌గా మారుద్దాం

- సీఎం హామీ మేరకు పత్తికొండలో టమాట ప్రాసెసింగ్ ఇండస్ట్రీ ఏర్పాటుపై దృష్టి సారించాలి
- భూమి, నిధుల అవసరంపై ప్రతిపాదనలు సిద్ధం చేయండి
- రాబోయే 3 నెలల్లో 3000 మందికి సోలార్ డ్రయర్లు
- పశ్చిమ ప్రాంత అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి
- వ్యవసాయ,అనుబంధ శాఖల సమావేశంలో కలెక్టర్ సృజన


మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సృజన

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాను ఆహారశుద్ధి పరిశ్రమల హబ్‌గా అభివృద్ధి చేద్దామని, ఈ దిశగా వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ జి.సృజన చెప్పారు. రాబోయే మూడు నెలల్లో పశ్చిమ ప్రాంతంలో మూడు వేల మందితో ఉల్లి, టమాట సోలార్ డ్రయర్లు నెలకొల్పడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. పత్తికొండ పర్యటనలో భాగంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి టమాట ప్రాసెసింగ్ ఇండస్ట్రీ ఏర్పాటుకు హామీ ఇచ్చారని, ఇందుకు అవసరమైన భూమి, నిధులు తదితర వివరాలతో ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఏపీఎంఐపీ పీడీని ఆదేశించారు. ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ కింద పశ్చిమ ప్రాంతంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్‌లు నెలకొల్పడానికి తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో సోలార్ డ్రయర్లు పెద్ద ఎత్తున ఏర్పాటవుతున్నాయని, వీటికి లోగ్రేడ్ ఉల్లి మాత్రమే అవసరమవుతుందని తెలిపారు. డిపార్టుమెంట్ల వారీగా ఆదోని ఏరియా అభివృద్ధికి అవసరమైన కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉల్లి, టమాట, మిర్చి, చిరుధాన్యాల పంటలతో ఆహారశుద్ధి పరిశ్రమలు ఏర్పాటుకు అవకాశం ఉందన్నారు. అలాగే 2023–24 సంవత్సరానికి సంబంధించి సూక్ష్మ సేద్యం అమలు కోసం కొత్త రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ఏపీఎంఐపీ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీఎంఐపీ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, జిల్లా ఇన్‌చార్జ్ వ్యవసాయాధికారి బాల వర్ధరాజు, ఉద్యానశాఖ జిల్లా అధికారి పి.రామంజనేయులు, మత్స్యశాఖ అధికారి శ్యామలమ్మ, మార్కెటింగ్ శాఖ ఏడీ నారాయణ యూర్తి, ఏపీసీడ్ జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అడిగిన వారందరికీ ఉపాధి పనులు చూపాలి

కర్నూలు(సెంట్రల్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో అడిగిన వారందరికీ పనులు కల్పించాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో డ్వామా, పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2021–22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి పెండింగ్ ఉన్న పనులను పంచాయతీరాజ్ ఇంజినీర్లు ఇతర శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని పూర్తి చేయాలన్నారు. హార్టికల్చర్ ప్లాంటేషన్‌కు సంబంధించిన భూములను గుర్తించి అందుకు తగిన ప్రతిపాదనలను సిద్ధం చేయాలని డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డిని ఆదేశించారు. చెత్త సంపద తయారీ కేంద్రాల్లో 35 రూఫ్ లెవల్‌లో ఉన్నాయని, వాటిలో 21 కేంద్రాలకు నగదు మంజూరైనట్లు డీపీఓ నాగరాజు నాయుడు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి, పీఆర్ ఎస్‌ఈ సుబ్రమణ్యం, డీపీఓ నాగరాజునాయుడు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

గవర్నమెంట్ ప్లీడర్‌గా ఆనందరావు



కర్నూలు(లీగల్) : జిల్లా కోర్టు గవర్నమెంట్ ప్లీడర్‌గా ఆర్.ఆనందరావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కొత్తపల్లి మండలం దుద్యాల గ్రామానికి చెందిన ఈయన ఆత్మకూరులో న్యాయవాదిగా ప్రాక్టీసు మొదలు పెట్టి 1995లో కర్నూలుకు ప్రాక్టీసు మార్చారు. దాదాపు 33 సంవత్సరాల నుంచి న్యాయవాద వృత్తిలో కొనసాగుతూ సివిల్ కేసులు వాదిస్తున్నారు. సీనియర్ న్యాయవాది, సౌమ్యుడిగా పేరున్న ఆనందరావు గవర్నమెంట్ ప్లీడర్(జీపీ)గా ఎంపిక కావడంతో జిల్లా కోర్టుల్లో ఆయన ప్రభుత్వం తరఫున సివిల్ కేసులు వాదించనున్నారు. సీనియర్ న్యాయవాదులు, బార్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.నాగభూషణం నాయుడు, ఎం.వి.చక్రపాణి, వై.జయరాజు, బి.చంద్రుడు, మాదన్న, మహా విష్ణు, ఏవీ సుబ్రహ్మణ్యం, సుబ్బయ్య, రామకృష్ణుడు, ప్రసాద్, మద్దులేటి తదితరులు జీపీగా ఎన్నికైన ఆనందరావును మంగళవారం కర్నూలులో ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు.

జెడ్పీలో పది మందికి ఏఓలుగా పదోన్నతి


జెడ్పీ చైర్మన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఓలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ పరిధిలో పది మంది సీనియర్ అసిస్టెంట్లకు పరిపాలనాధికారులుగా(ఏఓ) పదోన్నతి కల్పించి పోస్టింగ్‌లు అందించారు. రాష్ట్ర ప్రభుత్వం గత నెల 28న ఉమ్మడి కర్నూలు జిల్లాలో అర్హులైన 12 మంది ఏఓలకు ఎంపీడీఓలుగా పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆయా మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాల్లో ఖాళీగా ఉన్న ఏఓ పోస్టులను సీనియర్ అసిస్టెంట్ల పదోన్నతుల ద్వారా భర్తీ చేశారు. ఇదే సమయంలో అర్హులైన సీనియర్ అసిస్టెంట్లకు ఏఓలుగా పదోన్నతి కల్పించడం పట్ల పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు సి.మురళీమోహన్‌రెడ్డి జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి, సీఈఓ జి.నాసరరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కౌతాళం: మండల పరిధిలోని కడిదొడ్డి గ్రామానికి చెందిన గౌతులదొడ్డి బొజ్జయ్య మంగళవారం అక్రమంగా కర్ణాటక మద్యాన్ని కౌతాళం, కోసిగి మండలాలకు ద్విచక్రవాహనంలో తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. 960 ఒరిజినల్ చాయిస్ డీలక్స్ విస్కీ ప్యాకెట్లు ఉన్న 10 బాక్సులను, బైక్‌ను సీజ్ చేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. మండలంలో ఎవరైనా అక్రమంగా మద్యం విక్రయించినా రవాణా చేసినా కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ నాగేంద్ర కుమార్ రెడ్డి ఈ సందర్భంగా హెచ్చరించారు.


స్వాధీనం చేసుకున్న మద్యం చూపుతున్న ఎస్‌ఐ

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్

- కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్


గోరుకల్లు తండాలో కుళాయిని పరిశీలిస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్

పాణ్యం: జల్‌జీవన్ మిషన్ పథకం సురక్షిత మంచి నీరు అందించేందుకు ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇస్తున్నట్లు జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అన్నారు. మంగళవారం గోరుకల్లు తండాలో జేజేఎం పథకం కింద ఏర్పాటు చేసిన పైపులైన్ పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తండాలో రూ.25 లక్షలతో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వడం జరిగిందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. జల్‌జీవన్ మిషన్ ద్వారా ప్రజలకు అందించే నీటిని పరిశీలించిన తర్వాతనే సరఫరా చేయాలన్నారు. ప్రతి వారానికోసారి ట్యాంక్ శుభ్రం చేసి, ఆ తేదీని ట్యాంక్‌పై తప్పక రాయాలన్నారు. పైపులైన్ లీకేజీలు లేకుండా చూసుకోవాలన్నారు. గ్రామస్తుల విన్నపం మేరకు హైవే నుంచి తండాలోని నూతనంగా విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే కొత్తగా తండాల్లో రెండు చోట్లా గ్రావెల్ రోడ్లు వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కాలనీలో పర్యటించారు. ఓహెచ్‌ఆర్ ట్యాంక్ ఎక్కి అందులో ఉన్న నీటి నిల్వను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఎస్‌ఈ మనోహర్, డీఈ మధుసూదన్, ఏఈ మధుశేఖర్, ఎంపీడీఓ దస్తగిరి తదితరులు ఉన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


మృతిచెందిన వెంకట్

సి.బెళగల్: మండల పరిధిలోని క్రిష్ణదొడ్డి గ్రామానికి చెందిన ఓ యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. సి. బెళగల్ ఎస్‌ఐ పీరయ్య తెలిపిన వివరాల మేరకు.. క్రిష్ణదొడ్డి బీసీ కాలనీలో నివాసముండే బోయ నెంబి వెంకటేశ్వర్లు, సావిత్రి దంపతులకు ఓ కుమార్తె, ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు వెంకటరాముడు అలియాస్ వెంకట్ (23) తిరుపతిలో డిగ్రీ చదివాడు. ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటూ బ్యాంక్ ఉద్యోగాలకు ప్రిపేర్ అవుతున్నాడు. సోమవారం మధ్యాహ్నం సి.బెళగల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెంకట్ బయటకు వెళ్లాడు. రాత్రి అయిన తిరిగి రాకపోవడంతో కుమారుడి సెల్ నంబర్‌కు తండ్రి పలుమార్లు ఫోన్ చేశాడు. స్పందించకపోవడంతో బంధువులు, స్నేహితులకు ఫోన్ చేసి ఆరా తీశాడు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో మంగళవారం ఉదయం గ్రామ శివారులో గాలిస్తుండగా క్రిష్ణదొడ్డి గ్రామానికి వెళ్లే పాత దారి కొండలో విగతజీవిగా కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహంపై రక్తగాయాలు, యాసిడ్ పోసిన ఆనవాలు ఉండటంతో హత్య చేసి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు కోడుమూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఒకే రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ

- రూ.3.10 లక్షలు నగదు, విలువైన పానర్ల కిట్ అపహరణ


రూ. 3 లక్షలు చోరీకి గురైన ఇమ్రాన్ ఐరన్‌మార్ట్ దుకాణం


మహాలక్ష్మి ఆటో మొబైల్‌షాపులో దొంగలు తొలగించిన రేకును చూపిస్తున్న యజమాని రవి

ఆదోని అర్బన్ : ఆదోని పట్టణంలో సోమవారం రాత్రి నాలుగు దుకాణాల్లో చోరీ జరిగింది. మాధవరం రోడ్డు సిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలోని ప్రధాన రోడ్డులో ఉన్న ఇమ్రాన్ ఐరన్‌మార్ట్, మోటార్‌సైకిల్ మెకానిక్, మహాలక్ష్మి ఆటోమొబైల్స్, పటేల్ ఐరన్ మార్ట్ దుకాణాల్లో గుర్తు తెలియని దుండగులు చొరబడి రూ. 3.10 లక్షల నగదు, విలువైన పరికరాలు ఎత్తుకెళ్లారు. దుకాణాల రేకుల సెట్టర్లను తొలగించి చోరీకి పాల్పడినట్లు బాధితులు తెలిపారు. సిరుగుప్ప చెక్‌పోస్టు సమీపంలోని ఇమ్రాన్ ఐరన్‌మార్ట్ దుకాణంలో చొరబడి టేబుల్ డ్రాయర్‌ను పగులగొట్టి అందులోని రూ.3 లక్షల నగదు దోచుకెళ్లారని యజమాని ఇమ్రాన్ తెలిపారు. ఎప్పుడూ దుకాణంలో డబ్బు పెట్టేవాళ్లం కాదని, మంగళవారం ఐరన్‌లోడు వస్తుందని డబ్బులు ఉంచినట్లు బాధితుడు తెలిపాడు. ఇదే రోడ్డులోని మోటార్‌సైకిల్ మెకానిక్ షెడ్‌లో వెనుక నుంచి దూరి రూ. 15 వేలు విలువ చేసే పానర్ల కిట్‌ను అపహరించుకెళ్లినట్లు యజమాని హుసేన్‌వలి తెలిపారు. మహాలక్ష్మి ఆటోమొబైల్స్ రేకుల దుకాణంలో రూ.3500 నగదు ఎత్తుకెళ్లినట్లు యజమాని రవి తెలిపారు. మాధవరం రోడ్డు ఆర్టీఓ కార్యాలయం సమీపంలోని పటేల్ ఐరన్‌మార్ట్ దుకాణంలో గేటు దూకి టేబుల్ డ్రాయర్‌ను పగుల గొట్టి రూ.6 వేలు నగదు దొంగలించారని యజమాని పటేల్ వెల్లడించారు. ఈ దుకాణంలో దొంగతనం జరగడం రెండోసారి. నాలుగు దుకాణాల్లో చోరీపై బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

12న గుంటూరులో విత్తన మహోత్సవం

ఎమ్మిగనూరు రూరల్: ఈ నెల 12న గుంటూరులో విత్తన మహోత్సవ కార్యక్రమం నిర్వహించనున్నట్లు బనవాసి కృషి విజ్ఞాన కేంద్రం ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ డాక్టర్ సుజాతమ్మ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆచార్య ఎన్‌జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా గుంటూరులోని లామ్‌లో నిర్వహించే ఈ కార్యక్రమంలో అన్ని రకాల నాణ్యమైన, మంచి దిగుబడి ఇచ్చే విత్తనాలు అమ్మకాలు జరుగుతాయని వెల్లడించారు. మరిన్ని వివరాల కోసం రైతులు ప్రధాన శాస్త్రవేత్తలు డా.టి. శ్రీనివాస్ (వరి)–9396848380, డా. రాజమణి (అవరాలు,కంది,మినుము, పెసర, శనగ)– 9949907117, డా. ప్రసన్నరాజేష్ (నూనెగింజలు, వేరుశనగ, నువ్వులు) –9440566582, డా. మాధవీలత (చిరుధాన్యాలు, రాగి, కొర్ర, జొన్న) –7981929538 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు పొందవచ్చునని ఆమె తెలిపారు.

గడువులోపు వెబ్ ఆప్షన్లు

- జిల్లాలో బదిలీలకు 6,434 మంది ఉపాధ్యాయులు దరఖాస్తు
- ఇందులో 1,935 మంది తప్పనిసరి బదిలీలు
- 4,499 మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు
- 1,193 మందికి పదోన్నతులు

కర్నూలు సిటీ: జిల్లాలో 6,434 మంది ఉపాధ్యాయులు బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 1,935 మంది కంపల్సరీ బదిలీ, 4,499 మంది రిక్వెస్ట్ బదిలీకి దరఖాస్తు చేసుకున్నారు. గ్రేడ్–2 హెచ్‌ఎంల వెబ్ ఆప్షన్ గడువు మంగళవారంతో ముగిసింది. మిగిలిన స్కూల్ అసిస్టెంట్, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు నేటి(బుధవారం) రాత్రి 11.59 గంటల వరకు ఆప్షన్ ఇచ్చుకునేందుకు గడువు ఉంది. ఎస్‌జీటీ టీచర్లు రేపటి (గురువారం)రాత్రి 11.59 గంటల వరకు వెబ్ ఆప్షన్ ఇచ్చుకునేందుకు సమయం ఉంది. బదిలీల షెడ్యూల్ ప్రకారం 9వ తేదీన హెచ్‌ఎంలు, స్కూల్ అసిస్టెంట్ టీచర్ల బదిలీల జాబితాలు జనరేట్ అవుతాయి. 9 నుంచి 11వ తేదీల్లో ఎస్‌జీటీ టీచర్ల జాబితాలు జనరేట్ కానున్నాయి. బదిలీలు అయిన వారందరూ 12వ తేదీన బదిలీ అయిన స్కూళ్లలో చేరాల్సి ఉంటుంది. కాగా ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ బదిలీలకు దరఖాస్తు చేసుకున్న వారు నిర్దేశిత గడువులోపు వెబ్ ఆప్షన్లు ఇచ్చుకోవాలని విద్యాశాఖ అధికారి రంగారెడ్డి తెలిపారు.

1,198 మందికి పదోన్నతులు

జిల్లాలో సెకెండ్ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్న 1,198 మంది ఉపాధ్యాయులకు పదోన్నతులు లభించాయి. గత నెల చివరి వారంలో పదోన్నతులకు సమ్మతించిన వారి నుంచి విల్లింగ్ లెటర్లు తీసుకున్నారు. పదోన్నతులకు సంబంధించి కొందరు ఉపాధ్యాయ సంఘాల నాయకులు తప్పుడు ప్రచారం చేయడం, రెగ్యులర్ పదోన్నతులు కాదని పదోన్నతుల అవకాశం వచ్చిన వారికి చెప్పడంతో చాలా మంది నాట్ విల్లింగ్ లెటర్లు ఇచ్చారు. అయితే, సోమవారం రాత్రి పాఠశాల విద్యాశాఖ అధికారులు నిర్వహించిన వెబెక్స్‌లో రెగ్యులర్ పదోన్నతులేనని చెప్పి పదోన్నతులు పొందిన వారి లిస్ట్ జారీ చేశారు. ఇందులో ఎవరైనా బదిలీలకు దరఖాస్తులు చేసుకున్న వారు ఉంటే వారి దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నుంచి తొలగించి పదోన్నతులకు వెబ్ ఆప్షన్ ఇచ్చుకునే సదుపాయం అధికారులు కల్పించారు. అదే విధంగా ఏ సబ్జెక్టులోనైనా ఇంకా పదోన్నతులు కల్పించే సదుపాయం ఉంటే నాట్ విల్లింగ్ ఇచ్చిన వారి తరువాత సీనియారిటీ జాబితాలో ఉన్న ఉపాధ్యాయులకు మ్యాన్యువల్‌గా అవకాశం కల్పించారు. జిల్లాలో స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తూ గ్రేడ్–2 హెచ్‌ఎంలుగా 120 మంది, ఎస్‌జీటీలుగా పని చేస్తూ గణితంలో 305 మంది, ఫిజిక్స్‌లో 111, బయలాజికల్ సైన్స్‌లో 192, సోషల్ స్టడీస్‌లో 185, ఇంగ్లిష్‌లో 280 మంది టీచర్లు పదోన్నతులు పొందారు. వీరందరివి రెగ్యులర్ పదోన్నతులు కావడంతో రెండు ఇంక్రిమెంట్లు పొందే అవకాశం ఉందని విద్యాశాఖ వర్గాలు చెబుతున్నాయి.

మహిళలు ప్రకృతి వ్యవసాయంలో రాణించాలి


సమావేశంలో మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య

కర్నూలు(అగ్రికల్చర్): పొదుపు మహిళలు ప్రకృతి వ్యవసాయంలో రాణించాలని డీఆర్‌డీఏ–వైకేపీ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటసుబ్బయ్య అన్నారు. మంగళవారం డీఆర్‌డీఏ–వైకేపీ టీటీడీసీ సమావేశ భవనంలో జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు సీతాబాయి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పీడీ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. పొదుపు మహిళల్లో చాల వరకు చిన్న, సన్నకారు రైతులు ఉన్నారని, వారంతా ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటించాలన్నారు. భూములు లేని మహిళలు తమ ఇంటి పెరటిలోనే కూరగాయలు, ఆకు కూరలు పండించవచ్చని పేర్కొన్నారు. ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు లక్ష్యం, నిర్మాణం, అమలు విధానంపై అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.... ప్రకృతి వ్యవసాయం ద్వారా కలిగే ఉపయోగాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. సమావేశంలో ప్రకృతి వ్యవసాయం కన్సల్టెంటు లక్ష్మయ్య, ఐబీ యాంకర్ పర్సన్స్ ప్రభావతి, శ్రీనివాసులు, కాశీ, అశోక్, మాస్టర్ ట్రైనర్స్ మల్లికార్జున, ఆంజనేయులు, మండల మహిళ సమాఖ్య అధ్యక్షురాళ్లు పాల్గొన్నారు.

వీడిన బాలిక మిస్సింగ్ కేసు మిస్టరీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శివనారాయణస్వామి

ఆదోని రూరల్: పెద్దతుంబళం గ్రామానికి చెందిన 14 ఏళ్ల మైనర్ బాలిక మిస్సింగ్ కేసును పోలీసులు ఛేదించారు. మంగళవారం స్థానిక తాలూకా సర్కిల్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ శివ నారాయణస్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. మండలంలోని పెద్దతుంబళం గ్రామానికి చెందిన హనుమంత రెడ్డి రెండో కుమార్తె (మైనర్ బాలిక) మే 30వ తేదీ రాత్రి జ్వరం మాత్రలు తెచ్చుకునేందుకు మెడికల్‌షాపునకు వెళ్లింది. ఎంత సేపటికి తిరిగి రాకపోవడంతో తెలిసిన వారి ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో అదే నెల 31వ తేదీన పెద్దతుంబళం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేయగా అదే గ్రామానికి చెందిన ముచ్చుగిరి వీరేష్ అలియాస్ బోయ వీరేష్.. అతని సోదరులు బి.టి.ఈరన్న, లక్ష్మన్న సాయంతో కారులో బాలికను కర్ణాటక రాష్ట్రంలోని ఓ గ్రామానికి తీసుకెళ్లి అక్కడ ఆంజనేయస్వామి ఆలయం ఎదుట పెళ్లి చేసుకున్నట్లు తెలిసింది. మంగళవారం కోసిగి మండలం ఐరన్‌గల్ గ్రామం వద్ద ఆ ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకుని పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. కేసును ఛేదించిన పోలీసులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. సమావేశంలో తాలూకా సీఐ మహేశ్వర్‌రెడ్డి, పెద్దతుంబళం ఎస్‌ఐ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేడు ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం

కర్నూలు కల్చరల్: డిస్ట్రిక్ట్ ఫారెస్ట్ ప్రొటెక్షన్ కమిటీ సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతుందని జిల్లా ఫారెస్ట్ అధికారి పల్లె శివశంకర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టర్ చైర్మన్‌గా ఉన్న ఈ కమిటీ సమావేశంలో అడవుల సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించడం జరుగుతుందని తెలిపారు. డ్వామా పీడీ, ఎఫ్ఆర్‌ఓలు, ఆర్‌డీఓలు, తదితర శాఖల అధికారులు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

కొత్త బస్టాండ్‌లో విజిలెన్స్ దాడులు



షాపులో వస్తువుల ధరలను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కర్నూలు(రాజ్‌విహార్): కర్నూలు కొత్త బస్టాండ్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు దాడులు నిర్వహించారు. మంగళవారం తూనికలు, కొలతల శాఖ సిబ్బందితో కలిసి కొత్త బస్టాండ్‌లోని షాపుల్లో క్రయవిక్రయాలపై తనిఖీలు నిర్వహించారు. కొత్త బస్టాండ్‌లోని షాపుల్లో ఎంఆర్‌పీ కంటే అధిక ధరకు విక్రయిస్తుండడంపై ఈ నెల 3వ తేదీన 'సాక్షి' దినపత్రికలో 'ఇక్కడ అన్నీ అధిక ధరలే!' అనే వార్తా కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై విజిలెన్స్, తూనికలు, కొలతల శాఖ అధికారులు నిర్వహించిన దాడుల్లో వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అధిక ధరలకు సరుకులు విక్రయిస్తున్న తొమ్మిది షాపులపై కేసు నమోదు చేసి నిర్వాహకులకు రూ.38 వేల జరిమానా విధించినట్లు విజిలెన్స్ సీఐ నాగరాజు తెలిపారు.

పలువురు వైద్యుల బదిలీ

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో పనిచేస్తున్న పలువురు ప్రొఫెసర్లు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా నిర్వహించిన కౌన్సిలింగ్‌లో జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్ డాక్టర్ మహేశ్వర రెడ్డి తిరుపతి ప్రభుత్వ ఆసుపత్రికి, కడప ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న డాక్టర్ లక్ష్మీబాయి కర్నూలుకు బదిలీ అయ్యారు. అలాగే ఫార్మకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ విజయభాస్కర్‌రెడ్డి కడపకు, అక్కడ పనిచేస్తున్న డాక్టర్ రాజేష్ కర్నూలు మెడికల్ కళాశాలకు బదిలీ అయ్యారు.

11న ఫుట్‌బాల్ సంఘం సమావేశం

కర్నూలు (రూరల్): ఈనెల 11వ తేదీన నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో ఉదయం 10 గంటలకు జిల్లా ఫుట్‌బాల్ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా కార్యదర్శి వై.శ్రీనివాసులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యవర్గ సభ్యులు, వివిధ క్లబ్‌ల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, పీఈటీలు,పీడీలు తప్పక హాజరుకావాలని కోరారు.

డాక్టరేట్ ప్రదానం



వై.ధనరాజ్

కర్నూలు(సిటీ): గోనెగండ్ల మండలం పెద్దమర్రివీడు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వై.ధనరాజుకు ఆచార్య నాగార్జున యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. 'ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల బోధన సామర్థ్యం, బోధన ఆసక్తి, ఉపాధ్యాయుల సమర్థత' అనే అంశంపై డాక్టర్ సి.గ్రేస్ ఇందిరా, రీసెర్చ్ సూపర్‌వైజర్, అసోసియేట్ ప్రొఫెసర్, ఎస్‌జేసీఈ పర్యవేక్షణలో పరిశోధన (పీహెచ్‌డీ) పూర్తి చేయడంతో డాక్టరేట్ వరించింది.

రెగ్యులర్ చేయాలి

కర్నూలు సిటీ: అన్ని శాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు, అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేయాలని కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం (ఆర్.జే.డీ సెలెక్ట్ చేసిన లెక్చరర్స్)రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అబ్దుల్ జబ్బార్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేస్తామని ప్రభుత్వం ప్రకటించడం హర్షిస్తున్నామన్నారు. జీఓ నెంబరు 61 (2007) ప్రకారం 2000 నుంచి 2008 వరకు జాయిన్ అయిన ఒప్పంద అధ్యాపకులను మాత్రమే రెగ్యులర్ చేస్తారని చెబుతున్నారన్నారు. 2009 నుంచి 2012 వరకు నియామకాలు పొందిన వారిని సైతం రెగ్యులర్ చేయాలని కోరారు. ఇలాంటి వారు రాష్ట్ర వ్యాప్తంగా 1400 మంది ఉన్నారని, ఉమ్మడి జిల్లాలో 180 మంది పని చేస్తున్నారన్నారు. జూనియర్, డిగ్రీ కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులందరినీ రెగ్యులర్ చేసి, ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

చండ్ర రాజేశ్వరరావుకు నివాళి

కర్నూలు (రూరల్): కామ్రేడ్ చండ్ర రాజేశ్వరరావు ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ జిల్లా నాయకులు జగన్నాథం పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో చండ్ర రాజేశ్వరరావు 109 జయంతి కార్యక్రమాన్ని నగర సహాయ కార్యదర్శి మహేష్ అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా రాజేశ్వరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. జగన్నాథం మాట్లాడుతూ.. భూసంస్కరణలు అమలు చేయాలని, బంజరు భూములు, అటవీ భూములు పేదలకు పంచాలని రాజేశ్వరరావు పోరాటాలు చేశారన్నారు. సహాయ కార్యదర్శి రసూల్, సీనియర్ నాయకుడు మనోహర్ మాణిక్యం పాల్గొన్నారు.

ఆహారం విషతుల్యం

- విచ్చలవిడిగా కల్తీ
- యథేచ్ఛగా టేస్టింగ్ సాల్ట్, హానికర రసాయనాల వాడకం
- కల్తీ ఆహారం తింటే జీర్ణకోశ వ్యాధులు, క్యాన్సర్, సంతాన లేమి సమస్యలు
- నేడు ప్రపంచ ఆహార భద్రత దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): తినే ఆహారం ఏదైనా శరీరానికి ఉపయోగపడాలి. చెడు చేయకూడదు. ప్రస్తుతం మనకు లభిస్తున్న ఆహారంలో అధిక శాతం వ్యాధులను కొనితెచ్చేవిగా ఉన్నాయి. నాణ్యతలేని, కల్తీ ఆహారం ఎక్కువగా లభిస్తోంది. ఫలితంగా మనిషి అనేక వ్యాధుల బారిన పడుతున్నాడు. ఈ నెల 7న ప్రపంచ ఆహార భద్రతా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

జిల్లాలో దాదాపు 15వేలకు పైగా చిన్నా పెద్దా హోటళ్లు, రెస్టారెంట్లు, దాబాలు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చిరుతిళ్ల కేంద్రాలు ఐస్‌క్రీమ్ కేంద్రాలు, తోపుడు బండ్ల వ్యాపారాలు ఉన్నాయి. కర్నూలు నగరంలోనే 1800 దాకా హోటళ్లు ఉన్నాయి. ఆహార పరిరక్షణ, నాణ్యత ప్రమాణాల సంస్థ నుంచి 2006 చట్టం మేరకు లైసెన్స్ తీసుకుని, ఆ శాఖ నిబంధనల మేరకు ఆయా వ్యాపార కేంద్రాలు ఆహారం తయారు చేయాలి. ఈ శాఖలో ఒక అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, డిస్ట్రిక్ట్ ఫుడ్ కంట్రోలర్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్, ఆఫీస్ సూపరింటెండెంట్ పోస్టులున్నాయి. ఒక్కొక్కరు నెలకు 12 ఆహార శ్యాంపిల్స్ సేకరించాలి. ఈ మేరకు గత ఏప్రిల్ నుంచి ఇప్పటివరకు 138 శ్యాంపిల్స్ సేకరించారు. వీటిని ల్యాబోరేటరీకి పంపగా అందులో 5 నకిలీ, ఆరు సబ్‌బ్రాండ్, 8 తినడానికి పనికిరానివిగా నివేదికలు వచ్చాయి.

టేస్టీ సాల్ట్, హానికర రంగుల వాడకం

జిల్లాలోని పలు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫాస్ట్‌ఫుడ్ కేంద్రాల్లో టేస్టీ సాల్ట్ (అజినోమోటో) విచ్చలవిడిగా వాడుతున్నారు. దీనిని కేంద్ర ప్రభుత్వం నిషేధించినా మార్కెట్‌లో విచ్చలవిడిగా లభిస్తుంది. వీటిని వేయకపోతే ఆహారం రుచిగా ఉండదని, కస్టమర్లు రారని నిర్వాహకులు బాహాటంగానే చెబుతున్నారు. మరోవైపు ఆహార పదార్థాల్లో బుష్ పౌడర్, మెటాలిక్ ఎల్లో రంగులను అధిక మోతాదులో వాడుతున్నారు. ఆహార పదార్థాల్లో బుష్ పౌడర్‌ను కిలోకు 0.001 మి.గ్రా వాడాలి. అయితే వ్యాపారులు ఆహార పదార్థాలు ఆకర్షణీయంగా కనిపించాలన్న ఉద్దేశంతో కిలోకు 10 నుంచి 20 మి.గ్రా కలుపుతున్నారు. ఈ రంగులు, టేస్టీ సాల్ట్‌ను కలిపిన ఆహారం తింటే క్యాన్సర్, జీర్ణకోశ వ్యాధులు, సంతానలేమి, సెక్స్ సమస్యలు వస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదు.



వ్యాపార కేంద్రంలో నూనెను పరిశీలిస్తున్న డిస్ట్రిక్ట్ ఫుడ్ కంట్రోల్ ఆఫీసర్ శేఖర్‌రెడ్డి (ఫైల్)

పరిశుభ్రత గురించి పట్టింపు లేదు

పెద్ద హోటళ్లు, రెస్టారెంట్లు మినహా అధిక శాతం హోటళ్లు, టిఫిన్ సెంటర్లు, రోడ్డుసైడు హోటళ్లలో పరిశుభ్రత గురించి అస్సలు పట్టించుకోవడం లేదు. నాసిరకం ఆహార పదార్థాలు వాడటం, రోజుల తరబడి నిల్వ ఉన్న ఆహార పదార్థాలను విక్రయించడం చేస్తున్నారు. ఆహారం వండే ప్రాంతాలూ అపరిశుభ్రంగా ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు.



కర్నూలులోని ఫుడ్ కంట్రోల్ డిపార్ట్‌మెంట్ కార్యాలయం

ఆహారంలో కల్తీ ఇలా...

- పాలల్లో చిక్కదనం కోసం నాసిరకం పాలపౌడర్లు, యూరియా, పిండి, నూనె కలుపుతున్నారు.
- టీ పొడిలో ఇనుప రజను, రంపపు పొట్టు కలుపుతున్నారు. దీని వల్ల ఊపిరితిత్తులు పాడయ్యే ప్రమాదం ఉంది.
- పశువుల ఎముకల నుంచి ద్రావణం తీసి సాధారణ వంట నూనెల్లో కలిపి విక్రయిస్తున్నారు. దీని వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.
- చికెన్, మటన్ బిర్యానీలు, తందూరిలో హానికర రంగులు వాడుతున్నారు. వీటితో పాటు అనారోగ్యానికి గురైన, ప్రమాదాల్లో చనిపోయిన గొర్రెలు, పొట్టేళ్లు, మేకల మాంసం ఉపయోగిస్తున్నారు.
- నిషేధం ఉన్న క్యాట్‌ఫిష్‌లను సైతం చేపల విక్రయదారులు అమ్ముతున్నారు.
- మిరప పొడిలో ఎరుపు రంగు కోసం సూడాన్ రంగులు వాడుతుంటారు. పసుపులో మెటానిక్ ఎల్లో పదార్థాన్ని కలుపుతారు.
- వండిన నూనెనే మళ్లీ మళ్లీ కాచి వండడం ద్వారా క్యాన్సర్, అల్సర్లు వచ్చే ప్రమాదముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.
- చిన్న చిన్న హోటళ్లు, కర్రీపాయింట్లలో వేడి వేడి కూరలు, పప్పు, సాంబారును పల్చటి పాలిథిన్ కవర్లలో వేసి ఇస్తున్నారు. పదార్థాల వేడికి ప్లాస్టిక్ కరిగి తినే వారికి అనారోగ్యం కలిగిస్తున్నాయి.
- అల్లం, వెల్లుల్లి పేస్టులో ఆలుగడ్డ, ఉల్లి పేస్టును కలుపుతున్నారు.

వ్యాపారులకు లైసెన్స్ తప్పనిసరి

ఆహారాన్ని విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి లైసెన్స్ తీసుకోవాలి. లైసెన్స్ లేకపోతే తనిఖీల్లో దొరికినప్పుడు సెక్షన్ 63 ప్రకారం ఫుడ్ సేఫ్టీ కమిషన్ ద్వారా క్రిమినల్ కేసులు నమోదు చేస్తారు. నేరం రుజువైతే 6 నెలల జైలు శిక్షతో పాటు రూ.5 లక్షల జరిమానా విధిస్తారు.

కల్తీ చేశారని తెలిస్తే సమాచారమివ్వాలి



తినుబండారాలలో కల్తీ జరుగుతోందని తెలిస్తే సి.క్యాంపులో ఉన్న తమ కార్యాలయంలో ఫిర్యాదు చేయవచ్చు. లేదా 08518–229607కు ఫోన్ చేసి సమాచారం తెలియజేయవచ్చు. కల్తీ అని తేలితే సదరు వ్యాపారిపై ఎఫ్ఎస్ఎస్ఏఐ యాక్ట్ ప్రకారం చర్యలు తీసుకుంటాం. అలాగే నాణ్యత లేకపోయినా, నిర్వాహకులకు అనుమతి లేకున్నా చర్యలు తప్పవు.

– కె.కూర్మానాయకులు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్, ఉమ్మడి కర్నూలు జిల్లా

కల్తీ ఆహారంతో జీర్ణకోశ వ్యాధులు



కల్తీ ఆహారం తీసుకోవడం వల్ల జీర్ణకోశ వ్యాధులు వచ్చే అవకాశం ఉంది. పేగుల్లో బ్యాక్టీరియా చేరి ఇన్‌ఫెక్షన్ ఏర్పడి విరేచనాలు అవుతాయి. శరీరానికి అవసరమైన పోషకాలు అందవు. దీర్ఘకాలిక వ్యాధులు వచ్చే అవకాశం ఉంటుంది. సాంప్రదాయబద్ధమైన, ప్రకృతి సిద్ధమైన ఆహారం తీసుకోవడం మంచిది.

– డాక్టర్ ఎస్.జగదీశ్వర్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

అంతర్జాతీయ పోటీలకు ఎంపిక

కర్నూలు (రూరల్): మలేషియా దేశంలో ఆగస్టు చివరి వారంలో జరిగే అంతర్జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీలకు అబ్బాస్‌నగర్‌లోని రవీంద్ర స్కూల్ విద్యార్థిని జె.కీర్తన ఎంపికైనట్లు ఆ విద్యాసంస్థల డైరెక్టర్ జి.పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల చెన్నైలోని తాజెండ్ లైట్స్ క్లబ్‌లో నిర్వహించిన అండర్–17 బాలికల 42 కేజీల విభాగంలో సత్తా చాటి అంతర్జాతీయ పోటీలకు అర్హత సాధించిందన్నారు. ఈ సందర్భంగా క్రీడాకారిణి కీర్తనను పాఠశాల యాజమాన్యం అభినందించింది. విద్యాసంస్థల నిర్వాహకులు మమత మోహన్, వంశీధర్ పాల్గొన్నారు.

అక్రమ మట్టి తవ్వకాలపై చర్యలు

కర్నూలు కల్చరల్: రిజర్వ్ ఫారెస్ట్‌లో ప్రవేశిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కర్నూలు రేంజ్ ఎఫ్ఆర్‌ఓ సూర్యచంద్రరాజు హెచ్చరించారు. మంగళవారం యపర్లపాడు రిజర్వ్ ఫారెస్ట్‌లో అక్రమంగా మట్టి తవ్వుతున్న జేసీబీ, ట్రాక్టర్‌ను సీజ్ చేశారు. అల్లుగుండుకు చెందిన జి.రాఘవేంద్ర (తండ్రి నాగేశ్వరరావు)ను అదుపులోకి తీసుకున్నామన్నారు. డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ పీరయ్య, ఎఫ్‌బీవో రేణుకలు పాల్గొన్నారు.

మెరుగైన బోధనకు శిక్షణ

కర్నూలు సిటీ: మారుతున్న కాలానుగుణంగా ఉపాధ్యాయులు మెరుగైన విద్యాబోధన చేసేందుకు శిక్షణ కార్యక్రమాలు చక్కగా ఉపయోగపడతాయని డీఈఓ రంగారెడ్డి అన్నారు. స్థానిక డైట్ కాలేజీలో 2018 డీఎస్సీ ఉర్దూ మీడియం టీచర్లకు ఇండక్షన్ ట్రైనింగ్ కార్యక్రమం జరుగుతోంది. మంగళవారం ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేసి ప్రసంగించారు. కొత్తగా ఉద్యోగంలో చేరే వారు బోధన పద్ధతుల గురించి, ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా బోధన విధానాలను తెలుసుకునేందుకు శిక్షణ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. పాఠశాలలు పునఃప్రారంభమైనప్పుడు, కొత్తగా స్కూల్‌లో విద్యార్థులు చేరిన సమయంలో వారిని ఆకట్టుకునేలా బోధన ఉండాలన్నారు. ఆటపాటల ద్వారా విద్యాబోధన చేస్తే పిల్లలు అభ్యసించేందుకు ఆసక్తి చూపుతారన్నారు. ఉపాధ్యాయులు నిర్దేశిత కాలమాన పట్టిక ప్రకారం పాఠాలు బోధించాలని సూచించారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం



బండిమెట్టలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): పేదలకు సేవ చేయాలన్న లక్ష్యంతో ప్రభుత్వం నియమించిన వలంటీర్ల సేవలను సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన 3వ వార్డులో వివిధ శాఖల అధికారులతో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. బండిమెట్ట వీధుల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. ప్రభుత్వం నాలుగేళ్లలో మంజూరు చేసిన పథకాలను వివరిస్తూ సంక్షేమ క్యాలెండర్‌ను అందించారు. ప్రజలు చెప్పిన సమస్యలు విని వీలైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సమస్యల పరిష్కారమే ధ్యేయంగా గడప గడపకు వస్తున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ సేవలన్నీ ప్రజల ఇంటి వద్దకే అందాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక వార్డు కార్పొరేటర్ షాజహాన్ పర్విన్, నాయకులు ఖాదర్‌బాషా, ఖుద్దూస్, చాందు బాషా, ముజాహీద్, మున్న, గౌసియా, అక్బర్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, పాల్గొన్నారు.

భద్రత సూత్రాలు పాటించండి



ఉద్యోగులచే ప్రతిజ్ఞ చేయిస్తున్న విద్యుత్ శాఖ ఎస్ఈ ఎం.ఉమాపతి.

కర్నూలు(రాజ్‌విహార్): విధుల్లో ఉన్నప్పుడు భద్రతా సూత్రాలు పాటించాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్ఈ ఎం.ఉమాపతి సూచించారు. ఆయన మంగళవారం స్థానిక పవర్ హౌస్‌లో విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోజూ చేసిన పనే అని నిర్లక్ష్యం వహించరాదని, అనుకోని సందర్భాల్లో భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్ సిబ్బంది పనులు చేసేటప్పుడు తప్పనిసరిగా ఎర్త్ రాడ్ వేసుకోవడంతో పాటు హెల్మెట్ ధరించాలన్నారు. భద్రతా ప్రమాణాలు పాటించేందుకు కావాల్సిన ఎర్త్ రాడ్‌లు సిద్ధంగా ఉన్నాయని, ఏఈలతో ఇండెంట్ పెట్టించుకుంటే మంజూరవుతాయని చెప్పారు. ప్రైవేట్, అనధికార ఎలక్ట్రీషియన్లను స్తంభాలు ఎక్కించి పనులు చేయించరాదని, ఎవరైనా దుర్ఘటన జరిగితే బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యుత్‌ను పొదుపుగా వాడుకుని భవిష్యత్తు తరాలకు వెలుగు అందించాలన్నారు. కర్నూలు ఆపరేషన్స్ ఈఈ రమేష్, డీఈఈలు రాజమోహన్‌రెడ్డి, వై. సుబ్బన్న, ఏఈఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

తల్లిపాలతో శిశువుకు ఆరోగ్యం



మాట్లాడుతున్న డాక్టర్ రఘునాథ్

కర్నూలు (హాస్పిటల్): జన్మించిన నాటి నుంచి ఆరు నెలల వరకు బిడ్డకు తల్లిపాలే తాగించాలని ఇన్‌ఫాంట్ యంగ్ చైల్డ్ ఫీడింగ్ ట్రైనర్, ఆదోనికి చెందిన చిన్నపిల్లల వైద్యులు డాక్టర్ రఘునాథ్ చెప్పారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్, కర్నూలు ప్రభుత్వాసుపత్రి చిన్నపిల్లల విభాగం ఆధ్వర్యంలో మంగళవారం కర్నూలు మెడికల్ కళాశాలలోని న్యూ సీఎల్‌జీలో కాంప్లిమెంటరీ ఫీడింగ్ డే నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ రఘునాథ్ మాట్లాడుతూ బిడ్డకు ఆరు నెలల వరకు తల్లిపాలే ఇవ్వాలని, ఆ తర్వాత తల్లి పాలతో పాటు అనుబంధ ఆహారం ఇవ్వాలన్నారు. అనుబంధ ఆహారంగా ఏమి ఇవ్వాలి, ఎంత ఇవ్వాలి, వాటిలో పోషకాలు పిల్లలకు ఏ విధంగా ఉపయోగపడతాయనే విషయాలను వివరించారు. చిన్నపిల్లల విభాగం హెచ్‌ఓడీ డాక్టర్ విజయానంద బాబు మాట్లాడుతూ ఆరు నెలల తర్వాత పిల్లలకు పోషకాలతో కూడిన అనుబంధ ఆహారం కూడా ఎంతో ముఖ్యమన్నారు. రోజుకు మూడుసార్లు పోషకాలతో కూడిన ఆహారం ఇవ్వాలని సూచించారు. అనంతరం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ రవీంద్రనాథ్ రెడ్డి, డాక్టర్ ప్రకాష్ కుమార్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ శ్రీలత ప్రసంగించారు. ఇండియన్ అకాడమీ ఆఫ్ పీడియాట్రిక్స్ కర్నూలు కార్యదర్శి డాక్టర్ వీర రత్నాకర్ రెడ్డి, ప్రొఫెసర్ శారద, ఐసీడీఎస్ పీడీ ఉమా మహేశ్వరి, సీడీపీఓలు, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, ఎంబీబీఎస్, నర్సింగ్ విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనం నడిపితే చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. జిల్లా ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు మంగళవారం రాత్రి కర్నూలు నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రాజ్‌విహార్, సీ.క్యాంప్, పాత ఈద్గా, చెన్నమ్మ సర్కిల్‌లో తనిఖీలు నిర్వహించి త్రిబుల్ రైడింగ్, లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్న 25 మంది మైనర్లపై కేసులు నమోదు చేశారు. వీరికి రూ.50,875 జరిమానా విధించారు. మైనర్ల తల్లిదండ్రులను పిలిపించి స్థానిక ట్రాఫిక్ పోలీసు స్టేషన్‌లో కౌన్సెలింగ్ ఇచ్చారు. ఇంకెప్పుడు మైనర్లకు వాహనాలు ఇవ్వబోమని, నిబంధనలు ఉల్లంఘించబోమని వారిచే ప్రతిజ్ఞ చేయించారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి

- జూన్ 15 నాటికి స్టేజ్ కన్వర్షన్లలో పురోగతి ఉండాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులను ఆదేశించిన కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని, మండలాల వారీగా ఇచ్చిన లక్ష్యం మేరకు స్టేజ్ కన్వర్షన్ పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలను ఆదేశించారు. మంగళవారం ఆమె టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఇళ్ల నిర్మాణాలు, ఉపాధి హామీ పనులపై ఎంపీడీఓలు, హౌసింగ్ ఏఈలు, ఉపాధి హామీ ఏపీడీలతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ.. కొన్ని మండలాల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేశారు. జూన్ 15వ తేదీ నాటికి బీబీఎల్ నుంచి బీఎల్ స్థాయికి, బీఎల్ స్థాయి నుంచి కంప్లీషన్స్ స్థాయికి చేరుకోవాలన్నారు. జీరో పురోగతి సాధించిన ఎమ్మిగనూరు, కోడుమూరు, నందవరం, ఆలూరు, ఎమ్మిగనూరు అర్బన్, కల్లూరు, ఆదోని రూరల్, గూడూరు రూరల్, చిప్పగిరి, హాలహర్వి, ఆదోని అర్బన్ హౌసింగ్ ఏఈలు, ఎంపీడీఓలపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. రేపటి నుంచి లబ్ధిదారులతో మాట్లాడి ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆప్షన్–3 కింద ఇచ్చిన ఇళ్ల నిర్మాణాల్లోని పురోగతి సంతృప్తికరంగా లేదని, సంబంధిత కాంట్రాక్టర్లతో టెలీకాన్ఫరెన్స్ ఏర్పాటు చేయించాలని హౌసింగ్ పీడీ వెంకటనారాయణను ఆదేశించారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి వెనుకబడిన మండలాల్లో పండ్ల తోటల పెంపకానికి చర్యలు తీసుకోవాలన్నారు. హౌసింగ్, డ్వామా పీడీలు పీడీ వెంకటనారాయణ, అమర్‌నాథ్ రెడ్డి పాల్గొన్నారు.

రక్తహీనత నివారించాలి

కర్నూలు(హాస్పిటల్): కిశోర బాలికలందరికీ హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. పాఠశాలల్లో చదువుతున్న 10 – 19 ఏళ్ల విద్యార్థినులకు హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించగా 65 శాతం మంది రక్తహీనతతో ఉన్నట్లు డీఎంహెచ్‌ఓ కలెక్టర్‌కు వివరించారు. రక్తహీనత నివారణకు చర్యలు తీసుకోవాలని ఫ్యామిలీ డాక్టర్ విధానం జిల్లాలో పకడ్బందీగా అమలు కావాలని, గర్భవతులు, బాలింతలకు, మధుమేహ వ్యాధిగ్రస్తులకు, అధిక రక్తపోటు ఉన్న వారికి మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. ఆరోగ్యశ్రీ కింద ఆసుపత్రిలో చేరి డిశ్చార్జ్ అయిన రోగుల నుంచి ఏఎన్ఎంలు ఫీడ్‌బ్యాక్ రిపోర్ట్ తీసుకోవడంలో వంద శాతం పురోగతి సాధించాలని అన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.రామగిడ్డయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ సత్యవతి, అడిషనల్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ భాస్కర్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ రఘు, వైద్యశాఖ ఉన్నతాధికారులు వై.ప్రవీణ్‌కుమార్, బాలమురళి, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

యువకుడి బలవన్మరణం

కర్నూలు: కర్నూలు నగరం బుధవారపేటలో నివాసముంటున్న ముత్యాల రాజు అలియాస్ నవీన్ (18) ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నన్న, జయమ్మ దంపతులకు ఇద్దరు కొడుకులు, కూతుర్లు సంతానం. చివరివాడైన ముత్యాల రాజు గౌండా పనిచేస్తూ కుటుంబానికి చేదోడుగా ఉండేవాడు. కొంతకాలంగా మద్యానికి బానిసై ఆర్థికంగా ఇబ్బంది పడుతూ జీవితంపై విరక్తి చెంది సోమవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు కిందకు దించి ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి జయమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

భార్య కాపురానికి రాలేదని ఆత్మహత్య

కర్నూలు: కర్నూలు మండలం పసుపుల గ్రామానికి చెందిన చిరంజీవి (35) ఇంట్లో పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈయనకు 14 ఏళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన సమీప బంధువుల యువతితో వివాహమైంది. ముగ్గురు పిల్లలు సంతానం. కుటుంబ నిర్వహణ విషయంలో గొడవ పడి భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో కలత చెంది పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సబ్ డివిజన్‌కు 1253.5 క్వింటాళ్ల విత్తనాలు

కర్నూలు(అగ్రికల్చర్): వ్యవసాయ శాఖ కర్నూలు సబ్ డివిజన్‌లో విత్తన పంపిణీ చురుగ్గా జరుగుతోంది. కర్నూలు సబ్ డివిజన్‌లో సబ్సిడీపై పంపిణీ చేసేందుకు ప్రభుత్వం 1253.5 క్వింటాళ్ల విత్తనాలు కేటాయించిందని, వీటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు ఏడీఏ సాలురెడ్డి తెలిపారు. సబ్ డివిజన్‌కు వేరుశనగ 680 క్వింటాళ్లు కేటాయించగా.. ఇందులో కర్నూలు మండలానికి 30, కల్లూరుకు 50, కోడుమూరుకు 380, గూడూరు మండలానికి 100, సీ.బెళగల్ మండలానికి 110, ఓర్వకల్ మండలానికి 10 క్వింటాళ్ల ప్రకారం కేటాయించినట్లు ఆయన మంగళవారం వివరించారు. సబ్ డివిజన్‌కు 290 క్వింటాళ్ల కందులు, 8 క్వింటాళ్ల మినుములు, 7.5 క్వింటాళ్లు కొర్రలు, 245 క్వింటాళ్ల దయంచ, 23 క్వింటాళ్ల పిల్లిపెసర కేటాయించినట్లు చెప్పారు. రైతులు సంబంధిత రైతు భరోసా కేంద్రాల్లో ఈ-క్రాప్‌ యాప్‌లో నమోదు చేసుకొని సబ్సిడీపై విత్తనాలు పొందవచ్చని సూచించారు. అరకొర పదునులో విత్తనం వేయవద్దని, అలా చేస్తే విత్తనాలు మొలకెత్తే శాతం తక్కువగా ఉంటుందని పేర్కొన్నారు. మంచి పదునులోనే విత్తనం వేసుకోవాలని, విత్తనశుద్ధి తప్పనిసరని ఏడీఏ రైతులకు సూచించారు. ఎరువులకు ఎటువంటి కొరత లేదని, ఎంతమేర అవసరమో అంతే తీసుకోవాలన్నారు.

రాంగ్‌రూట్‌లో నడిపితే ఆటోలు సీజ్

కర్నూలు: రాంగ్ రూట్‌లో నడిపితే ఆటోలను సీజ్ చేసి డ్రైవర్ లైసెన్స్ రద్దు చేసేలా రవాణా శాఖ అధికారులకు సిఫార్సు చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. కర్నూలు నగరం కిడ్స్ వరల్డ్ వద్ద మంగళవారం ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ట్రాఫిక్ డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై రోడ్డు భద్రతా నిబంధనలపై ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఆటోడ్రైవర్లు విధిగా యూనిఫాం ధరించాలని, వాహన రికార్డులు, లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరూ ఇన్సురెన్స్ ఉన్న ఆటోలు మాత్రమే నడపాలన్నారు. ప్రమాదాలకు అవకాశం లేకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. నగరంలోని ప్రధాన రహదారుల్లో ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేయరాదన్నారు. పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద నిబంధనలు పాటించాలన్నారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం ప్రమాదకరమని, అతివేగంగా నడపకూడదన్నారు. ఆర్ఎస్ఐ హుసేన్ అహ్మద్, ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు తగదు

కర్నూలు(సెంట్రల్): జూన్ ఒకటి నుంచి అమల్లోకి వచ్చిన భూముల రిజిస్ట్రేషన్ చార్జీల పెంపును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ డిమాండ్ చేశారు. మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూముల రిజిస్ట్రేషన్ విలువలను పెంచడంతో పేద, మధ్యతరగతిపై తీవ్ర భారం పడుతుందన్నారు. ప్రతి ఏటా భూమి విలువను పెంచుకుంటూ పోవడంతో భవిష్యత్‌లో తీవ్ర ఇబ్బందులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. నాయకులు ఎం.రాజశేఖర్, రామాంజనేయులు, సాయిబాబా, సుధాకరప్ప, నరసింహులు, అబ్దుల్ దేశాయ్ విజయ్ పాల్గొన్నారు.

ఆలయ భూములను ఆక్రమిస్తే చర్యలు



సంస్కృత విద్యాదాన సమాజం అభివృద్ధిపై సూచనలిస్తున్న జిల్లా దేవదాయ శాఖ అధికారి రామాంజనేయులు

కర్నూలు కల్చరల్: జిల్లాలోని ఆలయాల భూములు, ఆస్తులను ఆక్రమించుకున్నా, అక్రమంగా కట్టడాలు నిర్మించినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని జిల్లా దేవదాయ శాఖ అధికారి ఎమ్. రామాంజనేయులు స్పష్టం చేశారు. మంగళవారం ఆయన కర్నూలు నగరం ఓల్డ్‌సిటీలోని కర్నూలు –1 గ్రూప్ టెంపుల్స్ పరిధిలోని సంస్కృత విద్యా దాన సమాజంను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రగంటి శేషావదానులు తన సొంత స్థలంలో సంస్కృత విద్యాదానం, అన్నదానం నిర్వహణకు సంస్కృత విద్యాదాన సమాజం స్థాపించారన్నారు. ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న సమాజంను దేవదాయ శాఖ నిధులతో పునర్నిర్మాణం చేసి పూర్వ వైభవం తీసుకురావాలని ఈఓ హనుమంతరావుకు తగు సూచనలు చేశారు. కర్నూలు డివిజన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

నకిలీ సర్టిఫికెట్లపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు (రూరల్): కర్నూలు నగరానికి చెందిన పరుశురాముడు నకిలీ షూటింగ్ బాల్ క్రీడా సర్టిఫికెట్లు విక్రయిస్తూ క్రీడాకారుల జీవితాలతో చెలగాటమాడుతున్నాడని రాష్ట్ర షూటింగ్ బాల్ సంఘం చైర్మన్ ఆర్.డి.ప్రసాద్ వాపోయారు. మంగళవారం స్థానిక మౌర్యా ఇన్ హోటల్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆర్.డి.ప్రసాద్ మాట్లాడుతూ.. నకిలీ సర్టిఫికెట్లు విక్రయిస్తూ తమ సంఘంపై అసత్య ఆరోపణలు చేస్తూ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు తప్పుడు సమాచారం ఇస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. షూటింగ్ బాల్ రాష్ట్ర కార్యదర్శి జోసెఫ్, కర్నూలు జిల్లా నాయకుడు ఈశ్వర్ నాయుడు, నరేష్, ఆట్యాపాట్యా కార్యనిర్వాహక కార్యదర్శి వంశీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**అనారోగ్యాలను దూరం చేసే చల్లని చిరునవ్వు ..
విధి నిర్వహణలో అంకితభావం ..
రోగులపాలిట ఆమె అపర నైటింగేల్ ...
సమాజ క్షేమం కోరేవారికి తర తమ భేదాలుండవు అని తన చేతల్లో చూపుతోంది కామారెడ్డి జిల్లా బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా పనిచేస్తున్న ఆరోగ్యజ్యోతి.**

సేవాజ్యోతి



పాతికేళ్లుగా విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ ఎంతోమంది మన్ననలు అందుకున్నారు ఆరోగ్యజ్యోతి. ఆమె సేవలను గుర్తించి ది నేషనల్ ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా, ది న్యూస్ పేపర్స్ అసోసియేషన్ ఆఫ్ కర్నాటక వారు 'నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్–2023' అవార్డుకు ఆమెను ఎంపిక చేశారు. మంగళవారం బెంగళూరులోని రవీంద్ర కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకుని సేవాజ్యోతిగా గుర్తింపు పొందింది ఆరోగ్యజ్యోతి.

బోధన్ పట్టణానికి చెందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రిలో హెడ్‌నర్స్‌గా విధులు నిర్వహిస్తోంది. 1998లో స్టాఫ్ నర్స్ ఉద్యోగంలో చేరి నిజామాబాద్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రెండేళ్లు పనిచేసిన ఆమె 2000 సంవత్సరంలో బోధన్ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి అక్కడే ఇరవై ఏళ్లుగా విధులు నిర్వర్తించింది. 2019 లో హెడ్ నర్స్‌గా పదోన్నతి పొందిన ఆరోగ్యజ్యోతి బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి బదిలీ అయి, అక్కడే విధుల్లో కొనసాగుతోంది. కరోనా కాలంలో వైద్యులతో కలిసి రోగులకు ఎన్నో సేవలందించిన ఈ నైటింగేల్ పాతికేళ్ల కాలంలో ఎక్కడ ఉద్యోగం చేసినా విధి నిర్వహణకు అంకితమై పనిచేస్తూ వచ్చింది. దీంతో ఆమె అందరికీ తలలో నాలుకలా మారింది. ఆపరేషన్ థియేటర్‌తోపాటు ప్రసూతి వార్డుల్లోనే ఆమె ఎక్కువగా విధులు నిర్వర్తించింది. అధికారుల నుంచి ఎన్నో మన్ననలు, సామాజిక సేవలకు గాను అవార్డులనూ పొంది సేవాగుణంలో ముందువరసలో నిలిచింది.

మాకెంతో గర్వకారణం

సేవతో అందరి మన్ననలు పొందే ఆరోగ్య జ్యోతి నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్–2023 అవార్డు అందుకోవడం ఎంతో సంతోషంగా ఉంది. మేమంతా గర్వించదగ్గ విషయం. ఈ అవార్డు స్ఫూర్తి మిగతా అందరిలో కలగాలని కోరుకుంటున్నాను.

– డాక్టర్ శ్రీనివాసప్రసాద్,
సూపరింటెండెంట్,
బాన్సువాడ ఏరియా ఆస్పత్రి

అందరి సహకారంతో...

సేవా కార్యక్రమాల్లో కుటుంబ సభ్యుల సహకారం ఎంతో ఉంది. ఉద్యోగ నిర్వహణలో తోటి ఉద్యోగులు, వైద్యుల సహకారం, ప్రోత్సాహంతోనే ముందుకు సాగుతున్నాను. నా చిన్నప్పుడు మా అమ్మానాన్నలు ఎంతోమందికి సాయం అందించేవారు. వాళ్లను చూసి నాకూ అలవాటైంది. నా ప్రయత్నాల్లో మా వారు అండగా నిలిచారు. అవార్డు అందుకోవడం ఆనందంగా ఉంది. మరింత బాధ్యత పెరిగిందని భావిస్తున్నాను.

– ఆరోగ్యజ్యోతి,
హెడ్‌నర్స్, బాన్సువాడ



కూతురి మరణంతో..

ఆరోగ్య జ్యోతి కూతురు అనుకోని పరిస్థితుల్లో విద్యుత్‌షాక్‌కు గురై మరణించింది. కూతురి మరణంతో ఆవేదనకు గురైన ఆరోగ్యలక్ష్మి తన సేవలను మరింత విస్తృతం చేయాలని సంకల్పించింది. ఆరోగ్య జ్యోతి చారిటబుల్ ట్రస్ట్‌ను ఏర్పాటు చేసి సేవా కార్యక్రమాలు చేపట్టింది. వైద్యరంగంలో తనకున్న పరిచయాలతో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తూ పేదలకు ఉచితంగా మందులు పంపిణీ చేసే కార్యక్రమాలు చేపడుతుంటుంది. బీపీ, షుగర్, గుండె సంబంధ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు చేపట్టి రోగులకు అండగా నిలుస్తోంది. అలాగే క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు కూడా చేపట్టి, గర్భిణీలు, బాలింతలకు అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం శిబిరాలు ఏర్పాటు చేసి ఆదుకుంటుంది.



బెంగళూరులో ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా నేషనల్ ఫ్లోరెన్స్ నైటింగేల్ -2023 అవార్డు అందుకుంటున్న ఆరోగ్యజ్యోతి

– ఎస్.వేణుగోపాల్ చారి,
సాక్షి, కామారెడ్డి

మలీషా మాణిక్యమే

మనలో టాలెంట్ ఉండాలేగానీ పాతాళంలో ఉన్నా సరే రివ్వున ఎగసి మిలమిల మెరిసే తారల్లా అందరి చూపులను మనవైపు తిప్పుకోవచ్చు అని చెబుతోంది మలీషా ఖార్వ. ముంబై మురికివాడ ధారావిలో పుట్టిపెరిగిన 15 ఏళ్ల మలీషా నేడు లగ్జరీ బ్రాండ్ మోడల్‌గా మారి అందరినీ ఆశ్చర్యపరుస్తోంది.



సాదాసీదాగా సాగిపోతున్న మలీషా జీవితాన్ని మలుపు తిప్పే సంఘటన ఒకటి జరిగింది. అదేమిటంటే, ఓ మ్యూజిక్ వీడియో తీయడానికి ఇండియా వచ్చిన హాలీవుడ్ నటుడు రాబర్ట్ హాఫ్‌మాన్.. తన పని పూర్తి చేసుకుని తిరిగి తన దేశానికి వెళ్లిపోదామనుకున్నాడు. కానీ అదే సమయంలో కరోనా మహమ్మారిని కట్టడి చేసేందుకు దేశంలో లాక్‌డౌన్ విధించడంతో.. ఇక్కడే ఉండిపోవలసి వచ్చింది. ఈ సమయంలోనే అనుకోకుండా అతడికి మలీషాతో పరిచయం అయ్యింది. తాను కలిసిన వాళ్లందరిలోనూ ఆమె విభిన్నంగా, ముఖ కవళికలు చూడముచ్చటగా కనిపించడంతో హాఫ్‌మాన్, 'పెద్దయ్యాక ఏమవాలనుకుంటున్నావు?' అని ఆమెను సరదాగా అడిగాడు. క్షణం కూడా తడుముకోకుండా 'నేను మోడల్‌ని కావాలనుకుంటున్నాను'' అని చెప్పింది మలీషా. ఆ చిన్నారి కలలను నిజం చేసేందుకు రాబర్ట్ 'గో ఫండ్ మి' పేజీ క్రియేట్ చేశాడు. దీంతోబాటు ఆమెను ఓ మోడలింగ్ మేనేజర్‌కు పరిచయం చేశాడు. అంతటితో ఆగక మలీషా పేరుతో ఇన్‌స్టాగ్రామ్ పేజీ క్రియేట్ చేశాడు.

అప్పటినుంచి మోడలింగ్ మేనేజర్ చెప్పినట్లు చేస్తూ మోడల్‌గా ఫొటోలు దిగేది మలీషా. ఆ ఫోటోలు ప్రముఖ ఫారెస్ట్ ఎసెన్షియల్ బ్రాండ్‌కు నచ్చడంతో ... వారు కొత్తగా ప్రవేశపెట్టిన 'ద యువతి కలెక్షన్స్'కు మలీషాను మోడల్‌గా తీసుకున్నారు. ఫారెస్ట్ ఎసెన్షియల్ స్టోర్‌కు వెళ్లిన మలీషా అక్కడ ఉన్న పోస్టర్లు, బ్రాండ్ ఉత్పత్తులపై తన ఫొటో రావడంతో తెగ సంబరపడిపోయింది. మలీషా సంబరపడిపోతున్న వీడియోను బ్రాండ్ వారు అధికార ఇన్‌స్టాగ్రామ్ పేజీలో విడుదల చేశారు. ఈ వీడియోకు యాభైలక్షలకుపైగా వ్యూస్, లైక్‌లు రావడంతో సోషల్ మీడియాలో మలీషా బాగా పాపులర్ అయ్యింది. ఈ వీడియో చూసిన నెటిజనులంతా ఆమెను ''ప్రిన్సెస్ ఆఫ్ స్లమ్''గా అభివర్ణిస్తున్నారు.

మోడలింగ్‌తోపాటు నటనలో కూడా తన టాలెంట్ చూపిస్తోన్న మలీషా ''లీవ్ యువర్ ఫెయిరీ టేల్'' డాక్యుమెంటరీలో నటించింది. పీకాక్ మ్యాగజీన్‌పైనేగాక, సమీరారెడ్డి, కుషాకపిలతో పాటు మలీషా ఫోటో 'కాస్మో ఇండియా మ్యాగజీన్'పైన కూడా రావడం విశేషం. పదోతరగతి చదువుతోన్న మలీషా పరిణితి చెందిన అమ్మాయిలా కనిపిస్తుంది. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడుతుంది. తనకొచ్చిన పాపులారిటీతో భవిష్యత్‌ను ఉజ్వలంగా తీర్చిదిద్దుకునేందుకు మలీషా మరింత ఉత్సాహంతో ముందుకు సాగుతోంది. తన కలలు నిజం కావాలని ఆశిద్దాం.

కిడ్నాప్ చేస్తారని భయం వేసింది!

"ప్రియాంక చోప్రాలా మోడల్ అవాలని, నోరా ఫతేహీ డ్యాన్స్ చేయాలని ఉండేది. కానీ మాది చాలా పేద కుటుంబం. ఈ మురికి వాడ నుంచి ఆ స్థాయికి ఎలా ఎదగాలి అని ఆలోచిస్తూ ఉండేదాన్ని. మోడలింగ్ మేనేజర్‌ను కలిశాక... 'ఎవరో ఒకతను నా ఫొటోలు తీస్తుంటే ఎందుకితను నా ఫొటోలు తీస్తున్నాడు? బహుశా కిడ్నాప్ చేస్తాడేమో' అని భయం వేసింది. అది గమనించిన ఆ మేనేజర్ 'అలాంటిదేం లేదు. నీ ఫొటోలు పాపులర్ అవుతాయి' అని చెప్పడంతో భయం పోయింది. ఆ ఫొటోలు చూసిన మేనేజర్ 'నీ కళ్లు చాలా బావున్నాయి. మోడల్‌వి అవుతావా?' అని అడిగారు. అప్పుడు నేను మా నాన్నను అడగాలని చెప్పాను. వెంటనే ఆయన నాన్న గారిని కలిసి మోడలింగ్ గురించి వివరించి చెప్పారు. నాన్న వెంటనే మా తాతయ్యవాళ్లతో చెప్పి ఒప్పించడంతో ఇప్పుడు నా కలలను నిజం చేసుకోవడానికి దారి దొరికింది. మోడలింగ్ చేస్తూ ఉన్నత చదువులు చదువుతాను" అని ఎంతో ఆత్మవిశ్వాసంతో, మరెంతో సంతోషంతో చెప్పింది.



మలీషా



బ్యూటిప్స్

రంధ్రాలు మాయం చేసే.. మెంతి ప్యాక్!

రాత్రంతా నానబెట్టుకున్న టీస్పూను మెంతులను నీళ్లు తీసేసి మిక్సీ జార్ లో వేయాలి. దీనికి ఆరు వేపాకులు, రెండు కీరదోసకాయ ముక్కలు జోడించి పేస్టు చేయాలి. ఈ పేస్టులో టీస్పూను ముల్తానీ మట్టి, అర టీస్పూను నిమ్మరసం వేసి చక్కగా కలిపి, ముఖానికి పూతలా వేసుకుని ఇరవై నిమిషాలపాటు ఆరనివ్వాలి. తరువాత చేతులని తడిచేసుకుని ఐదు నిమిషాలపాటు మర్దన చేసి చల్లటి నీటితో కడిగేయాలి.
- వారానికి ఒకసారి క్రమం తప్పకుండా ఈ ప్యాక్ వేసుకోవడం వల్ల ముఖం మీద అసహ్యంగా కనిపిస్తోన్న రంధ్రాలు, డార్క్ సర్కిల్స్, మొటిమల తాలుకు మచ్చలు పోయి ముఖం చర్మం బిగుతుగా మారి, మృదువైన నిగారింపుని సంతరించుకుంటుంది.
- మెంతుల్లోని యాంటీ ఆక్సిడెంట్స్, యాంటీ ఏజింగ్ గుణాలు ముఖ చర్మానికి తేమనందించి చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచుతాయి.



Vక్టరీ కోడ్

యూత్ పల్స్

యాపిల్ వరల్డ్ వైడ్ డెవలపర్ కాన్ఫరెన్స్ (డబ్ల్యూడబ్ల్యూడీసీ) కొద్దిరోజుల క్రితం కాలిఫోర్నియాలోని యాపిల్ పార్క్‌లో మొదలైంది. యువతలోని టెక్ ప్రేమికులకు ఇది పండగలాంటి బిగ్ ఈవెంట్. హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్ మార్పులకు సంబంధించి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవడం ఒక కోణం అయితే, 'డబ్ల్యూడబ్ల్యూడీసీ'లో పాల్గొనే అవకాశం సొంతం చేసుకున్న 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల మాటలతో స్ఫూర్తి పొందడం మరో కోణం...

సాంకేతిక దిగ్గజం 'యాపిల్' ప్రతి సంవత్సరం స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ నిర్వహిస్తుంది. 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్–2021' విజేతలలో న్యూజెర్సీకి చెందిన అభినయ దినేష్ ఒకరు. భారతీయ మూలాలు ఉన్న అభినయ పదిహేను సంవత్సరాల వయసులో 'గ్యాస్ట్రో ఎట్ హోమ్' అనే యాప్‌ను క్రియేట్ చేసింది. జీర్ణకోశ సంబంధిత వ్యాధులతో బాధ పడేవారికి అవసరమైన సమాచారానికి ఉపకరించే యాప్ ఇది.

'అనుకున్న ఐడియాను యాప్‌గా రూపొందించడం అనేది కష్టంతో కూడుకున్న పని' అంటోంది అభినయ.

భారతీయ మూలాలు ఉన్న అవితా విజయ్ (ఆస్ట్రేలియా) తొమ్మిదేళ్ల వయసులోనే యాపిల్ 'డబ్ల్యూడబ్ల్యూడీసీ–2016' విజేతలలో ఒకరిగా నిలిచింది. యాపిల్ ఐఫోన్, ఐపాడ్‌ల కోసం యాప్స్‌ను క్రియేట్ చేసింది.

'కోడింగ్ అనేది చాలా కష్టం' అంటూనే కోడింగ్‌పై అమితమైన ఇష్టాన్ని ప్రదర్శిస్తోంది.

గత సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతల జాబితాలో జస్కరన్ సింగ్, గీతాన్ష్ ఆత్రే, సుయాష్‌లు ఉన్నారు. పదమూడు సంవత్సరాల వయసులో సోదరుడిని స్ఫూర్తిగా తీసుకొని గీతాన్ష్ కోడింగ్ జర్నీ మొదలు పెట్టాడు.



ఈ సంవత్సరం విజేతలలో...

ఇండోర్ (మధ్యప్రదేశ్)కు చెందిన ఆస్మీ జైన్ ఒకరు. ఇరవై సంవత్సరాల ఆస్మీ జైన్ యూజర్ ఐ మూమెంట్స్‌ను ట్రాక్ చేసే యాప్‌ను డిజైన్ చేసింది. కంటిసమస్యలు ఎదుర్కొనే వారికి ఉపయోగపడే యాప్ ఇది. వైద్యరంగానికి అవసరమయ్యే యాప్‌లను తయారు చేయాలనేది ఆస్మీ లక్ష్యం.

'నా ప్యాషన్‌ను ప్రపంచంతో షేర్ చేసుకోవడానికి కోడింగ్ అనేది ఒక సాధనంలా ఉపయోగపడుతుంది' అంటుంది ఆస్మీ.

ఇరవై అయిదు సంవత్సరాల మార్త మైఖేల్‌కు పురాజీవశాస్త్రం అంటే ఇష్టం. ఇటలీ నేపుల్స్ నగరంలోని 'యాపిల్ డెవలప్‌మెంట్ అకాడమీ' స్టూడెంట్. ఈ సంవత్సరం 'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్' విజేతలలో మార్త ఒకరు.

మెమొరీ గేమ్ యాప్ ప్లేగ్రౌండ్‌కు రూపకల్పన చేసిన మార్త 'ఇతరులతో నా భావాలను పంచుకోవడంలో, కొత్తదారులు వెదుక్కోవడంలో కోడింగ్ నాకు ఉపయోగపడింది' అంటుందామె.

జంతుసంరక్షణ, పర్యావరణ సంరక్షణకు సంబంధించిన యాప్‌లను రూపొందించాలనేది ఆమె భవిష్యత్ లక్ష్యం.

'డబ్ల్యూడబ్ల్యూడీసీ కాన్ఫరెన్స్‌లో పాల్గొనడమే ఒక అదృష్టం అంటే అంతకంటే అదృష్టం ప్రపంచ నలుమూలల నుంచి వచ్చిన అసాధారణమైన స్టూడెంట్స్‌తో మాట్లాడే అవకాశం రావడం. వారి ద్వారా ఎన్నో కొత్త విషయాలు తెలుసుకోవచ్చు' అంటుంది చైనీస్ స్టూడెంట్ ఝూంగ్.

'స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్–2021' విజేతలలో ఝూంగ్ ఒకరు.

మెషిన్ లెర్నింగ్, ఏఆర్ చిత్రాలు, సంగీతాలను మిళితం చేస్తూ 'సీ యువర్ స్పోర్ట్స్' అనే ప్రాజెక్ట్‌కు సొంతంగా రూపకల్పన చేసింది ఝూంగ్.

'గత రెండు సంవత్సరాలుగా స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్ విన్నర్స్ గురించి తెలుసుకోవడం ఆసక్తిగా మారింది. వారి మాటలు నాకు ఎంతో స్ఫూర్తిని ఇస్తాయి' అంటుంది బెంగళూరుకు చెందిన ఇంజనీరింగ్ స్టూడెంట్ శ్రీరాగ.

నిజానికి ఇది శ్రీరాగ మాటే కాదు... తమ వయసులో ఉన్నవారి విజయాల నుంచి స్ఫూర్తి పొంది తాము కూడా ఏదైనా సాధించాలనుకునే యువతరం మనసులోని మాట.

సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

యాపిల్ వారి స్విఫ్ట్ స్టూడెంట్ చాలెంజ్‌లో పాల్గొనడానికి అతీతశక్తులు అవసరం లేదు. ఆసక్తి, ఆత్మవిశ్వాసం ఉంటే చాలు. 'కోడింగ్'ను ఇష్టపడే యువతరానికి ఇదొక గొప్ప అవకాశం. 'కోడింగ్‌పై ప్యాషన్ ఉంటే చాలు టాపిక్ మీ ఇష్టం' అంటుంది యాపిల్. ఈ చాలెంజ్‌లోని విజేతలకు బహుమతులు, యాపిల్ డెవలపర్ ప్రోగ్రామ్‌లో సంవత్సర కాల సభ్యత్వం ఒక విషయం అయితే ప్రపంచవ్యాప్త గుర్తింపు అనేది పెద్ద విశేషం. విజేతల విజయాలు వారికి మాత్రమే పరిమితం కావడం లేదు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది యువతకు స్ఫూర్తిని ఇస్తున్నాయి. 'నేనెందుకు ప్రయత్నం చేయకూడదు' అని సాధన మొదలు పెడుతున్నారు. సాధనతో సాధ్యం కానిది ఏమున్నది!

సౌండ్ హీలింగ్

మానసిక ప్రశాంతతకూ, ఒత్తిడి దూరం కావడానికీ సంగీతం ఒక సాధనం అని తెలుసు. కాని 'సౌండ్ హీలింగ్' వేరు. కచ్చితమైన పౌనఃపున్యం దగ్గర ధ్వని తరంగాలను సృష్టిస్తే అవి ఒక్కొక్కరికి ఒక్కో విధంగా సాంత్వన కలిగిస్తాయని చెబుతోంది డాక్టర్ అంజు శర్మ. సౌండ్ హీలింగ్ కోసం ఆమె నిర్వహిస్తున్న శిబిరాలు మంచి ఆదరణ పొందుతున్నాయి.

ధ్వనితో చేయొచ్చు చికిత్స



'మీరు కారులో వెళుతున్నారు. వెనుక నుంచి ఎవరో అదే పనిగా హార్న్ కొడుతున్నారు. మీకు కోపం వస్తుందా రాదా? మీరు అదే కారులో ప్రయాణిస్తున్నారు. లోపల ఇష్టమైన పాట వస్తోంది. మీ మూడ్ హాయిగా ఉంటుందా లేదా? అంటే మీరు ఏది వింటున్నారో అది మిమ్మల్ని రోగగ్రస్తం చేయగలదు... ఆరోగ్యవంతం చేయగలదు. ఏది వింటున్నాం, ఏది అంటున్నాం అనే దాని మీద దృష్టి పెడితే మీ చెవులకు చేరుతున్న ధ్వనులు, మీ గొంతు నుంచి వెలువడుతున్న ధ్వనులు... వీటిని మంత్రమయం, సంగీతమయం, శుభమయం, శాంతిమయం చేసుకుంటే మీరు మానసికంగా, భౌతికంగా, ఉద్వేగపరంగా సమతులంగా జీవించగలరు' అంటోంది డాక్టర్ అంజు శర్మ.

దేశంలో 'సౌండ్ ఎనర్జీ మాస్టర్'గా జనం ఆరోగ్యం కోసం పని చేస్తున్న అతి తక్కువ మహిళల్లో అంజు శర్మ ఒకరు. ఈమె సౌండ్ థెరపీ ద్వారా అంటే రకరకాల పౌనఃపున్యాలు వెలువరించే పరికరాల ద్వారా ధ్వనులు వినిపిస్తూ మెదడుకు, శరీరానికి తరంగాలు పంపుతూ శరీరం లోపలి అసమతుల్యతను, అపభ్రంశతను తొలగిస్తోంది.

శబ్ద ఔషధం

'మిమ్మల్ని ఎవరో తిట్టారు. ఆ తిట్టిన మాటను మీరు జీవితాంతం గుర్తుపెట్టుకుంటారు. అంటే ఆ శబ్దం మీ శరీరంలోకి వెళ్లిపోయింది. నెగెటివ్ ఎనర్జీలాగా ఉండిపోయింది. అదే మీరు ఒక మంచి మంత్రం విన్నారు. ఆశీర్వాదం విన్నారు. లేదంటే ఆలయ గంట విన్నారు. ఆ శబ్దాలు మీ లోపలికి వెళ్లాయి. అవి పాజిటివ్ ఎనర్జీగా పని చేస్తాయి. మాత్ర లోపలికి పోతే ఎలా ఔషధంగా పని చేస్తుందో శబ్దం మీ చెవి ద్వారా లోపలికి పోతే ఔషధంగా పని చేస్తుంది. సౌండ్ థెరపీలో ప్రకృతిలో వినవచ్చే శబ్దాల ద్వారా, సంగీత పరికరాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా, మానవ కంఠాల నుంచి వెలువడే శబ్దాల ద్వారా స్వస్థత పరుస్తాం' అని తెలుపుతోంది అంజు శర్మ.



'సౌండ్ హీలింగ్' చేస్తున్న డాక్టర్ అంజు శర్మ



నీటి సవ్వడి

'మనం పారుతున్న నీటి సవ్వడి వింటే ఆస్వాదిస్తాం. వాన శబ్దం విన్నా హాయిగా ఉంటుంది. ఎందుకు? మన శరీరంలో 70 శాతం నీరు ఉంటుంది. నీటి శబ్దం శరీరంలో రిథమ్ కోల్పోయిన నీటి కణాలను మళ్లీ రిథమ్‌లోకి తెస్తుంది. అందుకే ఎప్పుడైనా మానవ సంబంధాలతో వచ్చే స్ట్రెస్‌లో ఉంటే గనగ నీటి శబ్దం వినాలి. సాంత్వనం లభిస్తుంది' అని చెబుతుంది ఆమె. అప్పుడప్పుడు ప్రకృతిలోకి వెళ్లి ధ్యానం చేయడం కూడా ఆరోగ్యానికి మంచిదని చెబుతుందామె. 'ప్రకృతిలో వచ్చే శబ్దాలు ఒకవైపు మీ చెవిన పడుతుంటే ధ్యానం వల్ల మీరు మౌనాన్ని సాధన చేస్తుంటే మీ మనసు శరీరాలు ఎంతో ఓదార్పు పొందుతాయి' అంటుందామె. గృహిణులు ఇంట్లో పనులు చేసుకుంటున్నప్పుడు ఏదో ఒక ఇన్‌స్ట్రుమెంటల్ సంగీతాన్ని వినడం మంచిదని అంటుంది అంజు శర్మ. 'సీరియల్స్‌లో వినిపించే కలుషిత శబ్దాల కుట్రల డైలాగులు మీ లోపలికి వెళ్లి ఎలాంటి అనారోగ్యం కలిగిస్తాయో మీరు తెలుసుకోవాలి' అని హితవు చెబుతుంది.

కూనిరాగాల మేలు

'కొందరు కూనిరాగాలు తీసుకుంటూ పని చేసుకుంటారు. వయసు మళ్లిన వాళ్లకు కూనిరాగాలు దివ్య ఔషధంలా పని చేస్తాయి. కూనిరాగాలు శాంతిని కలుగచేస్తాయి. అలాగే అప్పుడప్పుడు చప్పట్లతో ధ్వని పుట్టించి వింటే మంచిది' అని తెలిపిందామె. 'మన శరీరంలో ప్రతి అణువుకు కంపించే శక్తి ఉంది. బయటి నుంచి వినే ధ్వనులు ఆ కంపనాలకు హాయిని కలిగించి అనుసంధానం కాగలిగితే రోగ కారక కణాలు ఏర్పడవు' అని తెలుపుతోంది అంజు శర్మ.